Follow: @ANNTELUGU

12-05-2025

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 160 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## అబ్బాయిలదే పైచేయి

### తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు రిలీజ్

### సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల

- మొదటి 10 ర్యాంకుల్లో బాలురే హవా
- ఇంజనీరింగ్ విభాగంలో 73.26%, అగ్రికల్చర్ విభాగంలో 87. 82% ఉత్తీర్ణత
- గతేడాదితో పోలిస్తే తగ్గిన పాస్ పర్సంటేజ్

**హైదరాబాద్, మహా:**

తెలంగాణ ఎప్‌సెట్ 2025 ఫలితాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఈ మేరకు ఫలితాలను విడుదల చేశారు. విద్యార్థులు సాధించిన ర్యాంకులు, మార్కుల జాబితాను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

## బూతులు తిడితే పదవులు రావు



- అధ్యక్ష పదవి వస్తాదని ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దు
- ఎంపీ ఈటల రాజేందర్ మర్యాదస్తుడు అనుకున్నాం
- మీరు నీచ భాష ఆపకపోతే అంతకు మించి మాట్లాడుతాం
- ఎంపీ ఈటల రాజేందర్‌కు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కౌంటర్

02

## బీజేపీ అగ్రవర్ణాల ఫ్యూడలిస్ట్ పార్టీ



- కులగణనపై అనుమానాలు నివృత్తి చేస్తాం
- ప్రధాని వద్ద సమయం ఇప్పిస్తారా ?
- బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్
- తెలంగాణ ప్రభుత్వ కృషికి గండికొట్టొద్దు: మంత్రి పొన్నం


02

## బట్టలు విప్పి నడిరోడ్డులో గుంజీలు తీయిస్తా



- ఈటల లిమిట్స్ దాటి మాట్లాడొద్దు
- పదవి రాలేదని ఫ్రస్టేషన్‌లో సైకోల చేయకు
- ముఖ్యమంత్రిని తిడితే ఏదో ఒక పదవి వస్తదా?
- మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు


02



## వీర జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాల మధ్య మురళీనాయక్ అంతిమయాత్ర
- అధికారిక లాంఛనాల నడుమ అంత్యక్రియలు
- అమరవీరుడికి అడుగడుగునా నీరాజనం
- నివాళులర్పించిన డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్


వివరాలు 3లో



## నిమిషం లేట్ అయినా నో ఎంట్రీ

- రేపే పాలిటెక్నిక్ ఎగ్జామ్
- రాష్ట్రవ్యాప్తంగా 276 పరీక్షా కేంద్రాలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

వివరాలు 3లో



## నేడు బుద్ధవనంకు అందగత్తెలు

- నాగార్జునసాగర్‌లోని బుద్ధ పార్కు సందర్శన
- 30 దేశాలకు చెందిన మిస్ యూనివర్స్ పర్యటన
- బుద్ధ పూర్ణిమ కావడంతో బుద్ధుడికి పుష్పాంజలి
- అక్కడి విగ్రహాల గురించి వారికి ప్రముఖ బౌద్ధ విశ్లేషకులు వివరణ

వివరాలు 3లో



# పీవోకేను అప్పగించాల్సిందే

### దానిని అప్పగించడం మినహా పాక్‌కు మార్గం లేదు

ఎవరి మధ్యవర్తిత్వం అక్కర్లేదు.. కుండబద్దలు కొట్టిన ప్రధాని మోదీ

ఆర్మీకి ఫుల్ పవర్స్.. ఈసారి కవ్విస్తే దబిడిదిబిడే

అటు నుంచి తుపాకీ గుళ్లు వస్తే.. భారత్ నుంచి మిస్సైల్స్ ప్రయోగించండి

త్రివిద దళాల అధిపతులకు ప్రధాని కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ, మహా :** పాక్ ఆక్రమిత కాశ్మీర్ అంశంపై మధ్యవర్తులు అవసరం లేదని ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌కు అప్పగించడం మినహా పాకిస్థాన్‌కు మరో మార్గం లేదని ఆయన అన్నారు. కాశ్మీర్ అంశం పరిష్కరించుకునేందుకు తాము మధ్యవర్తిత్వం వహిస్తామని అమెరికా చెప్పిన వేళ ప్రధాని వ్యాఖ్యలు ఒక్కసారిగా హీటెక్కించాయి. కాశ్మీర్ విషయంలో భారత్ వైఖరి ఎప్పుడూ ఒక్కటేనని మోదీ కుండబద్దలు కొట్టారు. కాశ్మీర్ విషయంలో ఇంతకుమించి మాట్లాడేదేమీ లేదని సుస్పష్టం చేశారు. ఉగ్రవాదులను అప్పగించే విషయంపై పాక్ మాట్లాడితే.. మేమూ మాట్లాడతామని ప్రధాని మోదీ చెప్పారు. ఇక త్రివిధ దళాల అధిపతులకు మోదీ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిసిపోలేదని అన్నారు. పాక్ దాడులకు దిగితే.. భారత్ సైతం ఎదురుదాడి చేస్తుందని ప్రధాని మోదీ హెచ్చరించారు.

**గట్టిగా బదులివ్వండి..**

**త్రివిధ దళాల అధిపతులకు సందేశం**

పాక్ కాల్పులకు దిగితే గట్టిగా బదులివ్వండంటూ త్రివిధ దళాల అధిపతులకు ప్రధాని మోదీ సూచించారు.

మిగతా 2లో

### ప్రధానికి అమెరికా వైస్ ప్రెసిడెంట్ కాల్

ఈ సందర్భంగా ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ పాక్ మా దేశంపై దాడి చేస్తే.. తిరిగి అటాక్ చేస్తామని జేడీ వాన్స్ కు ప్రధాని స్పష్టం చేశారు. తమ సంయమనం బలహీనత కాదని.. భారతదేశ భద్రతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ ఆయనతో చెప్పారు. భూమి ఉగ్రవాదం లేకుండా చేయాలని జేడీ వాన్స్ కు తెలియజేశారు. ప్రస్తుతం సీజ్ ఫైర్ లో భాగంగా సహనంతో ఉన్నామని, కానీ ఈ సారి పాక్ దాడి చేస్తే తమ వైపు నుంచి సమాధానం తీవ్రంగా ఉంటుందని అన్నారు. పాక్ ఏదైనా చేయాలని చూస్తే ఈ సారి విధ్వంసమేనని ప్రధాని మోదీ తెలియజేశారు.

## 100 మందికిపైగా ఉగ్రవాదుల్ని చంపేశాం

- చనిపోయిన వారిలో ఐసీ 814 హైజాక్ ఉగ్రవాదులు
- భారత దాడులతో పాకిస్థాన్ వణికిపోయింది
- పాక్ ప్రతిపాదన మేరకే కాల్పుల విరమణపై అవగాహనకు వచ్చాం
- ఎపుడైనా ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం
- ఆపరేషన్ సిందూర్‌పై త్రివిధ దళాల అధికారులు




03

## భారీ బడ్జెట్‌తో రోడ్లు

- తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తున్నాం
- రూ.38 వేల కోట్లతో 1719 కిలోమీటర్ల నేషనల్ హైవేలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



వివరాలు 2లో

## ప్రజల సమయం ఆదా

### ఇక రిజిస్ట్రేషన్లకు నో వెయిటింగ్

- 25 సబ్ రిజిస్టర్ ఆఫీసుల్లో ఇవాళ్టి నుంచే స్లాట్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



02

## తెరపైకి మంత్రివర్గ విస్తరణ

### పీసీసీ కార్యవర్గానికి లైన్ క్లియర్

ఈ వారంలోనే తొలివిడత పదవుల బొనాంజా

మే 20లోగా పీసీసీ కార్యవర్గం ప్రకటన..నేడు ఢిల్లీకి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్, మహా:**

మంత్రివర్గ విస్తరణపై మళ్ళీ కసరత్తు జరుగుతోంది. పలు జిల్లాలకు మంత్రులు లేకుండా ఏడాదిన్నర కావడం, ఈ పదవులపై ఆశ పెట్టుకున్న నేతలపై తీవ్ర ఒత్తిడి ఉండడంతో ఏదో ఒకటి తేల్చేయమని హైకమాండ్ పై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారు. మరోవైపు పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ నియామకం జరిగి కూడా 8మాసాలు కావస్తుండడంతో క్యాడర్ లో ఉత్సాహం నిండాలంటే పూర్తిస్థాయి కార్యవర్గం, కమిటీలు రావాలని ఆయన హైకమాండ్ ను కోరుతున్నారు. చాలా రోజులుగా వాయిదా పడుతున్న ముహూర్తం ఎట్టకేలకు ఖరారైనట్లు తెలుస్తోంది. సోమవాం పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఢిల్లీ వెళ్తుండగా, ఇప్పటికే కోర్ కమిటీకి సంబంధించిన అందరి అభిప్రాయాలతో తయారైన జాబితాకు ఆమోదముద్ర పడే అవకాశమున్నట్లు తెలుస్తోంది.



మిగతా 3లో

## ఈ నెల 16న ఐపీఎల్ పునఃప్రారంభం?

### రేపు టోర్నీపై రానున్న క్లారిటీ

- భారత్, పాక్ చర్చల తర్వాత అనుమతులు
- లీగ్ మ్యాచ్‌లను డబుల్ హెడర్ పద్ధతిలో పూర్తి చేయాలని డిసైడ్



వివరాలు 8లో



## పనులు చాలా స్లో!

### దీనికి మీరే జవాబు చెప్పాలి

- పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలి
- మినిట్ టు మినిట్ కార్యక్రమం తయారు చేయాలి
- అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు స్వీట్ వార్నింగ్

**భూపాలపల్లి, మహా:**

సరస్వతి పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం కాళేశ్వరంలో వీఐపీ ఘాట్, సరస్వతి మాతా విగ్రహం, జ్ఞాన తీర్థం, నదిలో భక్తులు స్నానమాచరించు ప్రదేశం, టెంట్ సిటీ, తదితర అంశాలను పరిశీలించారు. అనతరం టెంట్ సిటీలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి

మిగతా 2లో

### బషో- హైకు కవితా ప్రక్రియలో తొలి అడుగుల జాడ

వివరాలు 4లో

## రేవంత్ ప్యాలెస్ పాలన!

### సీఎం ఇంటి నుంచి ఎప్‌సెట్ రిజల్ట్సా?

సెక్రటేరియట్ ముఖం చూడట్లేదు.. ప్రజా పాలన అంటే ఇదేనా?

మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు

నీటి హక్కులను ఆంధ్రాకు తాకట్టు పెట్టారు

సీతారామ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం

మేము నిర్మించిన ప్రాజెక్టు వద్ద ఫొటోలకు మీ పోజులా?

ఏడాదిన్నర పాలనలో కనీసం ఒక్క ఎకరాకు నీళ్లివ్వలే

ప్రాజెక్టు పనులను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని మాజీ మంత్రి ట్వీట్

**హైదరాబాద్, మహా:**

అబద్ధాలే ఆధారంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మళ్లీ అవే అబద్ధాలతో పాలన సాగిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వంపై మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆయన ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా 2లో



## స్పెషల్ సెషన్ నిర్వహించాలె

- కాల్పుల విరమణను 'ట్రంప్' ఎందుకు ప్రకటించారు?
- భారత్‌కు పాక్ నుంచి ఏమి ప్రయోజనం వచ్చింది
- పార్లమెంట్‌లో ఆపరేషన్ సిందూర్ పై చర్చ పెట్టాలి
- ప్రధాని మోదీకి ఖర్గే, రాహుల్ వేర్వేరుగా లేఖలు



03

# రేవంత్ ప్యాలెస్ పాలన!

(మొదటిపేజీ తరువాయి)

సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల సంఘం, హైడ్రాలజీ అనుమతులు ఉన్నా కాంగ్రెస్ మాత్రం తెలంగాణ ప్రజలను తప్పుడు ప్రచారంతో మభ్యపెడుతున్నదని మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఏడాదిన్నర పాలనలో కనీసం ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేని, ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేని కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ సాధించిన సాగునీటి విజయాలను తమ ఘనతగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్ట్ దగ్గర ఫొటోలకు పోజులిచ్చి, అదే ప్రాజెక్టుపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రాజెక్టులు నిర్మించి నీళ్లు ఇవ్వడం మా తపన, ఫొటోలకు పోజులివ్వడం మీ ఘనతని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎడారిగా మారిన తెలంగాణ నేలని బీఆర్ఎస్ పాలనలో సస్యశ్యామలం చేశామన్నారు. నిజం మౌనంగా ఉంటే, అబద్ధమే రాజ్యం ఏలుతుందనే సామెత కాంగ్రెస్ పార్టీ తీరుకు అతికినట్టు సరిపోతుంది. నిజం మౌనంగా ఉంటే, అసత్యమే నిజమని నమ్మే పరిస్థితి ఏర్పడుతుంది కనుక కాంగ్రెస్ చెబుతున్న ప్రతి అబద్ధానికి ఆధారాలతో సహా నిజాన్ని ప్రజల ముందుంచడం మా బాధ్యతగా భావిస్తున్నామన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద 70.4 టీఎంసీల నీటిని వినియోగించి 6.74 లక్షల ఎకరాలకు సాగు నీటిని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు ఇవ్వవచ్చని, తాగునీరుతో పాటు పారిశ్రామిక అవసరాలకు వాడుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం 2021లోనే నిర్ధారించిందన్నారు. ఇంత స్పష్టంగా సెంట్రల్ వాటర్ కమిషన్, హైడ్రాలజీ అనుమతులు ఉన్న సీతారామ ప్రాజెక్టుకు నీటి



కేటాయింపులు జరగలేదని, ప్రాజెక్టుకు అనుమతులు లేవని మాట్లాడడం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అబద్ధపు ప్రచారాలకు పరాకాష్ట అంటూ వ్యాఖ్యలు చేశారు.

### అడ్డుకునే సత్తా కాంగ్రెస్‌కు లేదు..

రాష్ట్ర ప్రయోజనాలను తమ సొంత రాజకీయ ప్రయోజనాలకు తాకట్టు పెట్టే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ గురించి, కేసీఆర్ గురించి మాట్లాడటం హాస్యాస్పదమని హరీశ్ రావు అన్నారు. 'కృష్ణా నదిలో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాను పూర్తిగా వినియోగించుకోలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఆంధ్ర పాలకులు గోదావరిలో నీటి దోపిడీకి పాల్పడుతుంటే, అడ్డుకునే సత్తా కాంగ్రెస్‌కు లేదు. ఏడాదిన్నర పాలనలో కనీసం ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేని, ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేని కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ సాధించిన సాగునీటి విజయాలను తమ ఘనతగా చెప్పుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ నీటి దోపిడీని అడ్డుకోకుండా పదవుల కోసం పెదవులు మూసుకున్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు మరోసారి తెలంగాణ నీటిని అప్పనంగా కిందకు వదులుతూ రాష్ట్ర ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారు. అబద్ధాన్ని వందసార్లు చెప్తే నిజమవుతుంది' అనే భ్రమలో ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు చేసిన అన్యాయాలు మరిచిపోయారా? రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ వంటి ప్రాజెక్టులు తెలంగాణకు నష్టం కలిగించి ఆంధ్రాకు లాభం చేకూర్చేలా చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే కదా?' అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్ట్ దగ్గర ఫొటోలకు పోజులిచ్చి అదే ప్రాజెక్టుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. 'ప్రాజెక్టులు నిర్మించి నీళ్లు ఇవ్వడం మా తపన, ఫొటోలకు పోజులివ్వడం మీ ఘనత. మీ పాలనలో ఎడారిగా మారిన తెలంగాణ నేలని మా పాలనలో సస్యశ్యామలం చేశాం. సాగునీటిలో తెలంగాణకు 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన చేసిన అన్యాయం తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలన సాగునీటి రంగంలో విజయ బావుటా ఎగురవేసింది. ఉమ్మడి రాష్ట్రంలో జలయజ్ఞంలో ధనదాహంతో కళ్లు మూసుకుని తెలంగాణ రైతులను అన్యాయం చేశారని, ఇప్పుడు మరోసారి తెలంగాణ నీటిని ఆంధ్రాకు తాకట్టు పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ప్రజలు గ్రహిస్తున్నారు. ప్రతీ అంశంపై బీఆర్ఎస్ పాలనపై దుమ్మెత్తి పోయడం కాకుండా మిగిలిపోయిన ప్రాజెక్టు పనులను ఇప్పటికైనా చిత్తశుద్ధితో పూర్తి చేయాలని నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరుతున్నా.' అని హరీశ్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

## ప్యాలెస్ నుంచి పాలన

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఎప్‌సెట్ ఫలితాలను తన జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుండి విడుదల చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంభావం, పాలన మీద, విద్యార్థుల మీద ఉన్న చులకన భావాన్ని తెలియజేస్తుంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి, మంత్రులు కూడా 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో పోటీ పరీక్షల ఫలితాలను తమ ఇంటి నుండి విడుదల చేయలేదు అని ఆయన గుర్తు చేశారు. అయితే కమాండ్ కంట్రోల్ కేంద్రం నుండి లేక జూబ్లీ హిల్స్ ప్యాలెస్ నుండి పాలన కొనసాగించే ఈ ముఖ్యమంత్రి, అటు పోలీసులను పని చేసుకోనివ్వడం లేదు, ఇటు అధికారులను పని చేయనివ్వడం లేదు. సెక్రటేరియట్ ముఖం చూడడం లేదు. ప్రజా పాలన అంటే ఇదేనా?? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హరీశ్ రావు శుభాకాంక్షలు తెలిపారు.

# అబ్బాయిలదే పైచేయి

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల తెలంగాణ ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల ప్రిలిమినరీ కీ విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించిన విషయం తెలిసిందే. మొత్తంగా దాదాపు 3 లక్షల మంది విద్యార్థులు ఎప్‌సెట్‌కు హాజరయ్యారు. టీజీ ఈఏపీసెట్ ఫలితాలతో పాటు తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సిలింగ్ తేదీలను కూడా ప్రకటించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు ఫలితాలు చెక్ చేసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్ https://eapcet.tgche.ac.in/ చూడొచ్చు. రిజల్ట్ డైరెక్ట్ లింక్ ఇదే.. క్లిక్ చేయండి. విద్యార్థులు ఈఏపీసెట్ హాల్ టికెట్ నెంబర్, రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీ వంటి వివరాలు ఎంటర్ చేయడంతో విద్యార్థులు ఫలితాలను సెల్‌ఫోన్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగం, అగ్రికల్చర్ ఫార్మా విభాగం ఆన్సర్ కీ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో సంబంధం ఉన్న అధికారులు పాల్గొన్నారు.

**మొదటి 10 ర్యాంకుల్లో బాలురే..**

ఇంజినీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకులూ




బాలురకే వచ్చాయి. మొదటి మూడు ర్యాంకులూ ఏపీకి చెందిన విద్యార్థులకు దక్కాయి. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్‌చంద్రకు మొదటి ర్యాంకు, నంద్యాల జిల్లా కోనాపురం వాసి ఉడగండ్ల రామ్‌చరణ్‌రెడ్డికి రెండో ర్యాంకు, విజయనగరం జిల్లాకు చెందిన హేమసాయి సూర్యకార్తీక్‌కు మూడో ర్యాంకు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన మెండె లక్ష్మీభార్గవ్‌కు నాలుగో ర్యాంకు లభించింది. అలాగే అగ్రికల్చర్‌ఫార్మా ఫలితాల్లో మేడ్చల్‌కు చెందిన సాకేత్‌రెడ్డికి మొదటి ర్యాంకు వచ్చింది. కరీంనగర్‌కు చెందిన సబ్బాని లలిత్ వరేణ్య రెండో ర్యాంకు, వరంగల్‌కు చెందిన అక్షిత్‌కు మూడో ర్యాంకు లభించాయి. సాయినాథ్ (కొత్తకోట, వనపర్తి)కు నాలుగో ర్యాంకు, బ్రాహ్మణి (మాదాపూర్) కి ఐదో ర్యాంకు వచ్చింది.



## భారీ బడ్జెట్‌తో రోడ్లు

- తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తున్నాం
- రూ.38 వేల కోట్లతో 1719 కిలోమీటర్ల నేషనల్ హైవేలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** తెలంగాణ అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం రహదారుల నిర్మాణంతో పాటు విస్తరణ చేపడుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో భారతమాల పరియోజన మొదటి దశ కింద రూ.38,297 కోట్ల భారీ బడ్జెట్‌తో తెలంగాణ వ్యాప్తంగా 1,719 కిలోమీటర్ల జాతీయ రహదారులను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయనున్నట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. 2014 నుంచి తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం సుమారు రూ.31,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా 2,722 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం, మరో 2,526 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలను కల్పించడంలో ఆర్థిక ప్రగతికి, ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు.

# బట్టలు విప్పి నడిరోడ్డులో గుంజీలు తీయిస్తా

## ఈటల లిమిట్స్ దాటి మాట్లాడొద్దు

- పదవి రాలేదని ఫ్రస్టేషన్‌లో సైకోల చేయకు
- ముఖ్యమంత్రిని తిడితే ఏదో ఒక పదవి వస్తదా?
- మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆదివారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డిపై ఎంపీ ఈటల అసభ్యకరమైన భాష వాడుతున్నారని మండిపడ్డారు. ఈటల రాజేందర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నారని, కనీసం ఎప్పుడైనా సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి వెళ్లి జనాల సమస్యలపై ఎప్పుడైనా మాట్లాడావా అంటూ ప్రశ్నించారు. ఆయన బెవకూఫ్ చేష్టలు చేస్తున్నారని, ఓ పాగల్ గాడు అయ్యాడంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడి ఈటల రాజేందర్ కేంద్ర మంత్రి, పార్టీ అధ్యక్షుడు కావాలని అనుకుంటున్నాడన్నారు. ముఖ్యమంత్రిని తిడితే ఏదో ఒక పదవి వస్తది అనుకుంటున్నారని పేర్కొన్నారు. 'ఏమి మాట్లాడుతున్నావు రా నా కొడకా.. ఎందిరా' అంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. 'నువ్వు నీ పరిధి దాటి మాట్లాడుతున్నావు కాబట్టి నేను మాట్లాడాల్సి వస్తుంది. మేము తిడితే ఉరి వేసుకుని చస్తావు. సైకో ఎవడురా ఈటల రాజేందర్.. పోస్టు దొరకక ఏది పడితే అది మాట్లాడుతున్నవా. గంజాయి తాగిన వాడి లెక్క నీ భాష ఏందిరా. సీఎం కావాలని రేవంత్ రెడ్డి సీఎం అయ్యాడు. నువ్వు బీజేపీలో ఏమి కావాలని అనుకున్నావు ఏమి అవుతావు. దిక్కు దివానా లేని వాడివి నువ్వు నీకు గోల్ లేదు పాడు లేదు. ఎప్పుడు కులం పేరు చెప్పని ఈటల రాజేందర్ ఇప్పుడు కులం పేరు చెప్పుకుంటున్నావు. గాండు రాజకీయాలు చేస్తున్నావు. నువ్వు ఇంకో సారి కాంగ్రెస్ నేతల మీద నోరు జారితే నడి రోడ్డు మీద గుంజీలు తీపిస్తాను. నువ్వు అడవిలో తుపాకీలు పడితే నేను టౌన్‌లో తుపాకీ పట్టాను. ఫోకస్ కావాలంటే ఇంకో పార్టీ నాయకులను ఎంచుకో అంతే కానీ మా కాంగ్రెస్ పార్టీ నాయకులను ఏమి అనకు. జాలిపడి రేవంత్ రెడ్డి నిన్ను వదిలేసినట్టు ఉన్నాడు. జానెడు బెత్తడు లేవు నీకు పర్సనాలిటీ ఏమి ఉంది. నువ్వు ఏ భాష మాట్లాడితే నేను ఆ భాష మాట్లాడాల్సి వస్తుంది. నువ్వు పార్లమెంట్ భాషలో మాట్లాడితే నేను కూడా అదే భాషలో మాట్లాడాల్సి వస్తుంది' ఈటల రాజేందర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శించారు.

## పీవోకేను అప్పగించాల్సిందే..



(మొదటిపేజీ తరువాయి)

అటు నుంచి తుపాకీ గుళ్లు వస్తే.. భారత్ నుంచి మిస్సైల్స్ ప్రయోగించాలని తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌తో ప్రపంచానికి కొత్త సందేశం పంపామన్నారు. ఉగ్ర శిబిరాల సహా హెడ్ క్వార్టర్స్‌ను ధ్వంసం చేశామని చెప్పారు. వైమానిక దాడుల తర్వాత పాకిస్థాన్ చేతులెత్తేసిందని ఆయన పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందాన్ని సీమాంతర ఉగ్రవాదంతో ముడిపెట్టామని.. ఉగ్రదాడులు ఆగే వరకు ఒప్పందం నిలుపుదలలోనే ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాక్ దాడులు జరిపితే.. భారత్ అంతకు మించి దాడులు జరుపుతుంది. అటు నుంచి తుపాకీ గుళ్లు వస్తే.. ఇటు నుంచి మిసైల్స్ అటాక్ చేస్తాయి. కశ్మీర్ విషయంలో భారత్ వైఖరి ఎప్పుడూ ఒక్కటే. పీవోకేను అప్పగించడం మినహా.. పాక్ కు ఇంకో గత్యంతరం లేదు' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఇండియన్ ఆర్మీ చేసిన దాడులతో పాకిస్థాన్ పూర్తిగా ధ్వంసమైందని ప్రధాని మోదీ వెల్లడించారు. మనం చేసే యుద్ధంలో ప్రతి రౌండ్‌లో పాక్ ఓడిపోయిందని తెలిపారు. దాయాది ఎయిర్ బేస్‌లపై భారత్ చేసిన దాడులతో వాళ్లు అసలు యుద్ధంలోనే లేరనే విషయం అర్థమైందని ప్రధాని ఎద్దేవా చేశారు. దాడుల తర్వాత పాకిస్థాన్‌కు గట్టి సందేశం ఇచ్చామని ప్రధాని మోదీ అభిప్రాపడ్డారు.

### అత్యున్నత స్థాయి సమావేశం

మరోవైపు భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆదివారం అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ప్రధాని మోదీ నివాసంలో జరిగిన ఈ భేటీకి త్రివిధ దళాల అధిపతులు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జయశంకర్ హాజరయ్యారు. అత్యున్నత స్థాయి అధికారులతో జరిగిన ఈ సమావేశంలో ప్రధాని మోదీ పైవిధంగా స్పందించారు. ఇక వరుసగా నాలుగు రోజులు పాటు పాకిస్థాన్ క్షిపణులు, డ్రోనులతో భారత్‌పై దాడులకు తెగబడింది. వీటిని భారత్ తిప్పికొట్టింది.

## బీజేపీ అగ్రవర్ణాల ఫ్యూడలిస్ట్ పార్టీ

### కులగణనపై అనుమానాలు నివృత్తి చేస్తాం

ప్రధాని వద్ద సమయం ఇప్పిస్తారా ?.. బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్

తెలంగాణ ప్రభుత్వ కృషికి గండికొట్టొద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

**మహా:** తెలంగాణ ప్రభుత్వ కృషికి గండి కొట్టొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన బిల్లును ఆమోదింపజేసి బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని చెప్పారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన మీద అనుమానాలు ఉంటే నివృత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ప్రధాన మంత్రి దగ్గర సమయం ఇప్పిస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డెడికేటెడ్ కమిషన్ వేసుకొని లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో పారదర్శకంగా సర్వే నిర్వహించామని తెలిపారు. మహారాష్ట్రలో బీసీ కులగణన చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేయగానే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చారని, బీహార్‌లో కులగణన చేపట్టి ఆ నివేదిక అసెంబ్లీలో ప్రవేశపెట్టక ముందే ఆర్జేడీ, జేడీయూ ప్రభుత్వాన్ని బీజేపీ కూల్చేసిందని ఆరోపించారు. జార్ఖండ్‌లో బీసీల రిజర్వేషన్లు పెంచుతామని అసెంబ్లీలో తీర్మానం పెట్టగానే తప్పుడు కేసులతో ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సోరెన్‌ను జైల్లో వేశారని, అటువంటి చరిత్ర బీజేపీ కేంద్ర ప్రభుత్వానిదని తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రాల నుంచి కేంద్రం వరకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. బీజేపీ అధ్యక్ష పదవి, శాసనసభలో బీజేపీ ప్రతిపక్ష నాయకుడి పదవి, మండలిలో పక్ష నాయకుడి పదవులకు బీసీలు పనికిరారా? అని నిలదీశారు. అన్ని అత్యున్నత పదవులు వేరే సామాజిక వర్గానికి కేటాయించిన బీసీలపై మొసలి కన్నీరు కారిస్తే ఎవరు



అంగీకరిస్తారని అన్నారు.

**ఆ చరిత్ర కాంగ్రెస్‌దే..**


కేంద్ర విద్యా సంస్థలైన ఐఐటీ, ఐఐఎం లాంటి వాటిలో కూడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని మంత్రి గుర్తుకు చేశారు. బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీపై బీజేపీ నేత లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులగణనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు వెళ్లి అఫిడవిట్ సమర్పించిన చరిత్ర బీజేపీదన్నారు. మండల్ కమిషన్ వస్తే కమండలం తీసుకొచ్చిందని, బీజేపీ అగ్రవర్ణాల ఫ్యూడలిస్ట్ పార్టీ అని విమర్శించారు. కులగణన చేసి బీసీలకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచి చేసిన చట్టం తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా మారిందన్నారు. తెలంగాణను చూసే తప్పని పరిస్థితుల్లో కేంద్రంలో జన గణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. తెలంగాణలో చేసిన కులగణన చూసి దేశవ్యాప్తంగా చేస్తున్నారని, ఇక్కడ చేసిన కుల సర్వే ఆధారంగా పెంచిన 42శాతం బీసీ రిజర్వేషన్లను పెంచుతూ చేసిన చట్టాన్ని రాష్ట్ర బీజేపీ నేతలు ఆమోదింపజేసి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## బూతులు తిడితే పదవులు రావు

### అధ్యక్ష పదవి వస్తాదని ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దు

- ఎంపీ ఈటల రాజేందర్ మర్యాదస్తుడు అనుకున్నాం
- మీరు నీచ భాష ఆపకపోతే అంతకు మించి మాట్లాడుతాం
- ఎంపీ ఈటల రాజేందర్‌కు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కౌంటర్

**మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఖండించారు. ఈటల మతి తప్పి మాట్లాడుతున్నారని, ఆయన మాట్లాడే నీచ భాష ఆపకపోతే అంతకు మించిన భాష వాడాల్సి వస్తుందని ఫైర్ అయ్యారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు బీజేపీలో ఈటల రాజేందర్ మర్యాదస్తుడు అనుకున్నామని, కానీ ఆయనకు మతి తప్పి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. పదవులు, రాజకీయాల కోసం ఆయన దిగజారిపోయి మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. అలాగే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలంటే మీ అధిష్టానాన్ని కాక పట్టు



కోవాలి.. కానీ మా ముఖ్యమంత్రిని బూతులు తిడితే పదవి వస్తుందనుకోవడం నీ అవివేకానికి నిదర్శం అని ఎద్దేవా చేశారు. అంతేగాక మీరు నీచ భాష ఆపకపోతే మేం అంతకు మించిన భాషను వాడాల్సి వస్తోందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి తిడితే పదవి వస్తుంది అనుకుంటే.. పదవి మాత్రమే వస్తుందని, కానీ ప్రజల్లో పలుచన అయిపోతారని తెలిపారు. ఇప్పటివరకు మీపై ఉన్న గౌరవాన్ని మాటలతో పోగొట్టుకున్న వైనాన్ని గమనించాలని కోరారు. 30 ఏళ్లు రాజకీయాల్లో ఉన్న మీరు మాట్లాడాల్సిన భాషేనా అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ఈ దిగజారుడు భాషను మార్చుకోవాలని సూచించారు. ఆనాడు మీరు చేసిన అప్పులను తీరుస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి ఇలాంటి భాష వాడకం సబబు కాదని, వెంటనే సీఎంపై మీరు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు.

## పనులు చాలా స్లో!



(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి రాక సందర్భంగా బందోబస్తు, పనులు పూర్తి చేసే అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పనులు చాలా స్లోగా జరుగుతున్నాయని, మీరే జవాబు చెప్పాలన్నారు. పట్టణం మొత్తాన్ని విద్యుద్దీకరణతో ముస్తాబు చేయాలని 12 రోజుల పండుగ వాతావరణం చేయాలని సూచించారు. సరస్వతి మాత విగ్రహాన్ని పూలతో అందంగా అలంకరణ చేయాలని తెలిపారు. పిండ ప్రధాన భవనం అసంపూర్తిగా ఉందని దేవాదాయ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు హారతి కార్యక్రమాన్ని వీక్షించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు నదిలోకి స్నానాలకు వెళ్ళడానికి తాత్కాలిక రహదారి ఏర్పాటుతో పాటు క్వియర్ మాట్ ఏర్పాటు చేయాలని తెలిపారు.

**మినిట్ టు మినిట్ కార్యక్రమం..**

భక్తులు నదిలోకి వెళ్లకుండా బారికేడ్స్, ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్ సూచించారు. నదిలో 50 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు నాటు పడవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా మొట్టమొదటి సారిగా కాళేశ్వరంలో టెంట్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమాలు సజావుగా, సక్రమంగా పకడ్బందీగా జరిగేందుకు మినిట్ టు మినిట్ కార్యక్రమం తయారు చేయాలని సూచించారు. హారతి కార్యక్రమం పర్యవేక్షణకు దేవాదాయశాఖ నుండి ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవానికి వస్తున్నారని, అలాగే తదుపరి రోజుల్లో గవర్నర్, రాష్ట్ర మంత్రులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.

# ప్రజల సమయం ఆదా

### ఇక రిజిస్ట్రేషన్లకు నో వెయిటింగ్

25 సబ్ రిజిస్టర్ ఆఫీసుల్లో ఇవాళ్టి నుంచే స్లాట్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మహా:**

ప్రజలకు వేగవంతమైన, సమర్థమైన సేవలందించడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకురావడమే కాకుండా వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజల సమయాన్ని ఆదా చేసేందుకు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు స్వీకారం చుట్టామని ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు వచ్చే కొనుగోలుదారులు, అమ్మకం దారులు గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించవలసిన పరిస్థితిని మార్చామన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునికీకరించడమే కాక, స్లాట్ బుకింగ్ విధానాన్ని దశల వారీగా అమలులోకి తీసుకొస్తున్నామన్నారు. ఇప్పటికే గత నెల పదో తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు చేశామని, అక్కడ విజయవంతం కావడంతో నేటి నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని ప్రకటించారు.

## ఈ నెల చివరి నాటికి..

వచ్చే నెల చివరినాటికి రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేయడానికి 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాలలో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామన్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బందిని నియమించమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ విధానాన్ని ఉప్పల్, మహేశ్వరం, మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రవేశపెడుతూ అదనంగా ఒక్కొక్క సబ్ రిజిస్ట్రార్‌ని నియమిస్తామన్నారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరణ చేస్తున్నామని, ఇందులో భాగంగా అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని విలీనం చేసి పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# తెరపైకి మంత్రివర్గ విస్తరణ

## పీసీసీ కార్యవర్గానికి లైన్ క్లియర్

### ఈ వారంలోనే తొలివిడత పదవుల బొనాంజా

### మే 20లోగా పీసీసీ కార్యవర్గం ప్రకటన..నేడు ఢిల్లీకి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



(మొదటిపేజీ తరువాయి)

ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా జాబితాను పరిశీలించి పలు సూచనలు చేసినట్లు తెలిసింది.

**ప్రకటనే తరువాయి**

పీసీసీ కార్యవర్గం ప్రకటించేందుకు హై కమాండ్ అనేకమార్లు కసరత్తు జరిపి ఫైనల్ గా ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. సోమవారం పీసీసీ చీఫ్ ఢిల్లీ వెళ్తున్న నేపథ్యంలో ఈ వారంలో కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశం ఉందని పీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ఈనెల 20లోగా తొలివిడత పూర్తిచేయాలని ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ పట్టుదలగా ఉన్నట్లు తెలుస్తోంది. పీసీసీ కార్యవర్గంలో నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, పార్లమెంట్ కు ఒకరు చొప్పున ఉపాధ్యక్షుడు.. సెంట్రల్ నుండి మరో ముగ్గురు కలిపి మొత్తం 20మందితో ఈ జాబితా ఉండనున్నట్లు తెలుస్తోంది. మిగతా కార్యవర్గాన్ని నెలాఖరులోగా డీసీసీ చీఫ్ ల నియామకంతో పాటే ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మొదటి దశ కార్యవర్గం ప్రకటన కోసం ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇప్పటికే రాష్ట్రానికి చెందిన ఫైవ్ మెన్ కమిటీ అభిప్రాయాన్ని తీసుకున్నారు. 3 రోజుల పాటు ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు వేర్వేరుగా ఢిల్లీకి వెళ్లి.. కేసీ వేణుగోపాల్ ను కలిశారు. కార్యవర్గంలో ఎవరైతే బాగుంటుందనే దానిపై పూర్తిస్థాయి చర్చించి జాబితా తయారుచేసుకున్నారు. అయితే హైకమాండ్ దీనిపై తుది నిర్ణయం తీసుకుని జాబితా ప్రకటించనుంది. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ 3 రోజుల పాటు ఢిల్లీలోనే ఉండి దీనికి సంబంధించిన జాబితాను హైకమాండ్ కు అందజేశారు. దీనిపై ఇటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తో పాటు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయాలను హైకమాండ్ తీసుకున్నది.

**మంత్రివర్గ విస్తరణపైనా..**

మంత్రివర్గ విస్తరణకు సంబంధించి మళ్ళీ చర్చ జరుగుతోంది. నెలాఖరులోగా విస్తరణ పూర్తిచేయాలన్న ఒత్తిళ్ళు హైకమాండ్ మీద ఉన్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులతో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ గతంలో సమావేశమై విస్తరణపై చర్చించారు. 'ఈ విడత విస్తరణలో నలుగురికి అవకాశం కల్పించాలని సమావేశంలో అధిష్ఠానం నిర్ణయించిందని, సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జి.వివేక్, శ్రీహరి ముదిరాజ్‌ల పేర్లు ఖరారయ్యాయని..మార్చి 29 లేదా ఏప్రిల్ 3న ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందనే' ప్రచారం జరిగింది. అయితే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉన్నందున.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకొంటే సోదరులిద్దరూ ఒకే కేబినెట్‌లో ఉంటారని, ఇది సరైంది కాదని రాహుల్‌గాంధీ అభిప్రాయపడినట్లు ఆ తర్వాత ప్రచారం జరిగింది. 'అధికారంలోకి వస్తే మంత్రివర్గంలోకి తీసుకొంటామని ఎన్నికల ముందు కొందరికి హామీ ఇచ్చామని.. రాజగోపాల్‌రెడ్డి, వివేక్‌లు ఈ జాబితాలో ఉన్నారనే' అభిప్రాయాన్ని ఈ సందర్భంగా కొందరు నేతలు వ్యక్తంచేసిన మీదట 'తుది నిర్ణయాన్ని తాము తెలియజేస్తామని' అధిష్ఠానం రాష్ట్ర నేతలలో చెప్పినట్లు తెలిసింది. దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో తెలియదు. తాజాగా ఇలాంటి సమీకరణలతో పాటు కొన్ని జిల్లాల్లో ముగ్గురు.. కొన్ని జిల్లాల్లో ఒక్కరు కూడా లేకపోవడం వంటి అసమతుల్యతను, సామాజిక సమీకరణలను బ్యాలెన్స్ చేయాలన్న యోచనలో హైకమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అవసరమైతే ఒకటి, రెండు కోతలు పెట్టి.. పూర్తిస్థాయి కేబినెట్ ను సెట్ చేయాలన్న యోచనలో హైకమాండ్ ఉన్నట్లు తాజా చర్చ జరుగుతున్నది. మండల స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు పదవుల భర్తీ జరిగితేనే అధికార వికేంద్రీకరణ పూర్తయి క్యాడర్ లో జోష్ వస్తుందన్న అంచనాకు ఇటు రాష్ట్ర నాయకత్వం. అటు పార్టీ హైకమాండ్ ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

# 100 మందికిపైగా ఉగ్రవాదుల్ని చంపేశాం

## చనిపోయిన వారిలో ఐసీ 814 హైజాక్ ఉగ్రవాదులు

### భారత దాడులతో పాకిస్థాన్ వణికిపోయింది

### పాక్ ప్రతిపాదన మేరకే కాల్పుల విరమణపై అవగాహనకు వచ్చాం

### ఎప్పుడైనా ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

### ఆపరేషన్ సిందూర్‌పై త్రివిధ దళాల అధికారులు



**ఢిల్లీ, మహా :** ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతోనే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని భారత సైన్యం వెల్లడించింది. తాము చేపట్టిన ఆపరేషన్‌లో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపింది. దాడుల భయంతో ఉగ్రశిబిరాలు ఖాళీ అవుతున్నాయని పేర్కొంది. పహల్గాంలో 26 మంది అమాయకులను ముష్కరులు పొట్టనపెట్టుకున్నారని భారత సైన్యం వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి త్రివిధ దళాల అధికారులు మీడియా సమావేశంలో కీలక వివరాలు వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5, పాక్‌లోని 4 ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసినట్లు తెలిపింది.

**పాకిస్థాన్ వణికిపోయింది: రాజీవ్ ఘాయ్**

"పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులకు దీటుగా బదులివ్వాలని నిర్ణయించాం. ఉగ్రవాదులకు సరైన రీతిలో జవాబు చెప్పాలన్నదే ఆపరేషన్ సిందూర్ లక్ష్యం. సరిహద్దు అవతల ఉన్న ఉగ్ర శిబిరాలను కచ్చితమైన ఆధారాలతో గుర్తించాం. స్పష్టమైన ఆధారాలతో 9 ఉగ్రవాద శిబిరాలపై దాడులు నిర్వహించాం. ఈ దాడుల్లో 100 మంది ఉగ్రవాదులు చనిపోయారు. ఆ దాడులతో పాకిస్థాన్ వణికిపోయింది. ఆ తర్వాత మన పౌరులే లక్ష్యంగా పాకిస్థాన్ దాడులకు పాల్పడింది. అనంతరం తగిన మూల్యం చెల్లించుకుంది. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా ఉగ్రస్థావరాలపై దాడిలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ ఐసీ814 హైజాకర్లు, పుల్వామా దాడుల్లో పాల్గొన్న ముష్కరులు హతమయ్యారు. వీరిలో యూసుఫ్ అజహర్, అబ్దుల్ మాలిక్ రౌఫ్, ముదాసిర్ అహ్మద్ తదితరులు ఉన్నారు'' అని ఆర్మీ డీజీఎంవో రాజీవ్ ఘాయ్ వెల్లడించారు.

**40 మంది పాక్ సైన్యం మృతి!**

"ఈ నెల 8, 9వ తేదీ రాత్రి భారత్‌పై గగనతల దాడికి పాకిస్థాన్ యత్నించింది. డ్రోన్లు, మానవరహిత విమానాలు మనవైపు దూసుకొచ్చాయి. వాటన్నింటినీ భారత గగనతల రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. పౌరులపై దాడులను అడ్డుకున్నాం. డ్రోన్ దాడులకు ప్రతిగా పాక్ రాడార్ స్టేషన్లు, సైనిక స్థావరాలపై బలమైన దాడులు నిర్వహించాం. గగనతలం నుంచి భూతలంపై ఉన్న లక్ష్యాలను ఛేదించాం. లక్ష్యాల సాధనలో భారత్‌వైపు ఎలాంటి నష్టం లేకుండా దాడులు చేశాం. భారత్‌వైపు వచ్చిన ప్రతి డ్రోన్‌ను నిర్వీర్యం చేశాం'' "లాహోర్, గుజ్రన్‌వాలా రాడార్ కేంద్రాలను ధ్వంసం చేశాం. డ్రోన్ల దాడుల సమయంలో పాకిస్థాన్ పౌరవిమానాలనూ ఆకాశంలోకి అనుమతించింది. పరిస్థితి గమనిస్తూ.. కచ్చితమైన లక్ష్యాలతో పాక్ సైనిక స్థావరాలపై దాడులు చేశాం. మొత్తంగా మూడు రోజులపాటు కొనసాగిన దాడుల్లో 35 నుంచి 40 మంది పాకిస్థాన్ సైనికులు చనిపోయినట్లు అంచనా వేస్తున్నాం'' అని డీజీఎంవో స్థాయి అధికారులు పేర్కొన్నారు.

**పర్యవసానాలు రుచిచూపించాం**

"భారత వాయుసేన, క్షిపణి రక్షణ వ్యవస్థలతో సైన్యం పాక్‌కు స్పష్టమైన సందేశం ఇచ్చాం. పాక్ దుస్సాహసానికి పాల్పడితే ఎలాంటి పర్యవసానాలు ఎదురవుతాయో చూపించాం. సైన్యం, వాయుసేన చర్యలకు అనుబంధంగా అరేబియా సముద్రంలో నౌకాదళం సర్వసన్నద్ధంగా ఉంది. కశ్మీర్ నుంచి గుజరాత్ వరకు సరిహద్దు నగరాలపై డ్రోన్ దాడులకు యత్నించింది. గుంపులు గుంపులుగా డ్రోన్‌లతో దాడులకు యత్నించింది'' అని త్రివిధ దళాల అధికారులు పేర్కొన్నారు.

### మళ్లీ దాడులు చేస్తే..

"పాక్ ఎన్ని దుశ్చర్యలకు పాల్పడినా దీటుగా స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాం. పాక్ ప్రతిపాదన మేరకే కాల్పుల విరమణపై అవగాహనకు వచ్చాం. అయినా కొన్ని గంటల్లోనే మళ్లీ డ్రోన్ దాడులు కొనసాగించింది. ఇదే పరిస్థితి నేడు కొనసాగితే తీవ్ర ప్రతిచర్యలు ఉంటాయి. ఉల్లంఘనలపై దీటుగా స్పందించేందుకు క్షేత్రస్థాయి అధికారులకు సైన్యాధ్యక్షుడు పూర్తి అధికారాలు ఇచ్చారు" అని డీజీఎంవో అధికారి స్పష్టం చేశారు.

## పది ఉపగ్రహాలతో నిరంతర నిఘా: ఇస్రో ఛైర్మన్



**అగర్తల :** దేశ పౌరుల భద్రత, సురక్షతో పాటు వ్యూహాత్మక ప్రయోజనాల పరిరక్షణ కోసం పది అత్యంత కీలకమైన ఉపగ్రహాలు నిరంతరం నిఘా నేత్రాలుగా పనిచేస్తున్నాయని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. అగర్తలలో ఆదివారం జరిగిన సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (సీఏయూ) ఐదవ స్నాతకోత్సవంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఉపగ్రహాలు దేశ భద్రతకు కవచంలా నిలుస్తున్నాయని ఆయన నొక్కిచెప్పారు. "దేశ భద్రతను కాపాడుకోవాలంటే, మనకున్న 7,000 కిలోమీటర్ల సువిశాల సముద్ర తీర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలి. అత్యాధునిక ఉపగ్రహ, డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం లేకపోతే అనేక వ్యూహాత్మక లక్ష్యాలను మనం చేరుకోలేం," అని నారాయణన్ స్పష్టం చేశారు. ఈ పది ఉపగ్రహాలు సరిహద్దు భద్రత, అంతర్గత భద్రత, సముద్ర జలాల పరిరక్షణ వంటి అంశాలపై నిరంతర సమాచారాన్ని అందిస్తాయని, తద్వారా సత్వర చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని ఆయన తెలిపారు.



## వీర జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాల మధ్య మురళీనాయక్ అంతిమయాత్ర
- అధికారిక లాంఛనాల నడుమ అంత్యక్రియలు
- అమరవీరుడికి అడుగడుగునా నీరాజనం
- నివాళులర్పించిన డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్

**మహా:** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు అధికారిక లాంఛనాల నడుమ ముగిశాయి. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాలో మురళీనాయక్ అంత్యక్రియలు నిర్వహించారు. కళ్లితండాలోని నివాసం వద్ద మురళీ నాయక్ భౌతికకాయాన్ని ప్రముఖులు సందర్శించి.. అశ్రునివాళులు అర్పించారు. మురళీనాయక్ పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి సెల్యూట్ చేశారు. మురళీ నాయక్ తల్లిదండ్రులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. యుద్ధానికి ముందు వీరజవాన్ మురళీ నాయక్ బంధువు, స్నేహితుడు రాజశేఖర్‌తో జరిపిన వాట్సాప్ చాట్ ను లోకేష్ పరిశీలించారు. మురళీనాయక్ జ్ఞాపకాలను ఈ సందర్భంగా బంధువులు పంచుకున్నారు. మురళీ నాయక్‌కు జై, భారత్ మాతాకి జై, వందేమాతరం అంటూ.. ప్రజలు, స్థానికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అగ్నివీర్ మురళీ నాయక్ భౌతికకాయానికి నివాళులు అర్పించి, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మురళీనాయక్ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా అండగా ఉంటాయని, పవన్ కళ్యాణ్ భరోసా కల్పించారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆయన స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. మురళీనాయక్ కుటుంబానికి ఐదెకరాలతో పాటు 300 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించారు.

# అసద్.. నాలుగు సందేహాలు

## ఒప్పందం ఉన్నా.. లేకున్నా ఉగ్రవాదులను వదలొద్దు



**మహా:** భారత్ – పాక్ మధ్య కాల్పుల విరమణ జరిగినప్పటి నుంచీ.. అందుకు గల కారణాలు, ఒప్పందాలపై తీవ్ర చర్చ జరుగుతుండగా, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నా, లేకపోయినా ఉగ్రవాదులను విడిచి పెట్టొద్దని స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రవాదులకు శిక్ష పడాల్సిందేనన్నారు. బయట శక్తులు ఎప్పుడు దేశంలోకి ప్రవేశించినా భారత ప్రభుత్వానికి, ఆర్మీకి మద్దతుగా ఉంటానని అన్నారు. యుద్ధ సమయంలో ఆర్మీ చూపించిన తెగువకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సమయంలో.. యుద్ధ సమయంలో మరణించిన సైనికుడు మురళీ నాయక్, ఏడీడీసీ రాజ్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు. తనవద్ద నాలుగు సందేహాలు ఉన్నాయని.. ప్రభుత్వం వాటిని నివృత్తి చేస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

1. "ప్రధాని నరేంద్ర మోడీకి శుభాకాంక్షలు... కాల్పుల విరమణ గురించి ప్రకటించాల్సింది ఆయనే.. పరాయి దేశ అధ్యక్షుడు కాదు! సిమ్లా ఒప్పందం (1972) నుంచి మనం మూడో పక్షం మధ్యవర్తిత్వాన్ని వ్యతిరేకిస్తున్నాము.. అలాంటప్పుడు దీన్ని మనం ఎందుకు అంగీకరించాము?" "అసలు కాశ్మీర్ సమస్య అంతర్జాతీయ వేదిక వరకూ వెళ్లదని నేను ఆశిస్తున్నాను. ఎందుకంటే ఇది మన అంతర్గత విషయం!"
2. "మనం మూడో స్థానంలో చర్చలు జరపడానికి ఎందుకు అంగీకరించాము? ఈ కాల్పుల విరమణ వెనకున్న ఎజెండా ఏమిటి? పాకిస్థాన్ ఇకపై తన గడ్డను ఉగ్రవాదానికి ఉపయోగించదని అమెరికా ఏమైనా హామీ ఇస్తుందా?"
3. "భవిష్యత్తులో ఉగ్రవాద దాడుల నుంచి పాకిస్థాన్ ను నిరోధించాలనే లక్ష్యాన్ని మనం సాధించామా? ట్రంప్ మధ్యవర్తిత్వంలో కాల్పుల విరమణ తీసుకురావడమా.. లేక, పాకిస్థాన్ ను మరో దాడి గురించి కలలో కూడా ఊహించలేని స్థితిలో ఉంచడమా.. మన లక్ష్యం ఏమిటి?"
4. "పాకిస్థాన్ ను "ది ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్.ఎ.టీ.ఎ)" గ్రే లిస్ట్‌లో ఉంచడానికి అంతర్జాతీయ ప్రచారాన్ని మనం కొనసాగించాలి!

## జాటోత్ ఠాణు నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




**బాలాపూర్ మహా:** మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ,చందన చెరువు కట్ట పై కామ్రేడ్ జాటోత్ ఠాణు నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. భూమికోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం,రాజ్యాధికారం కోసం ,రజాకార్లకు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా,సాయుధ పోరాట యోద్యుడు అమరుడు జాటోత్ ఠాణు నాయక్ ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. భవిష్యత్ తరాలకు వారు చేసిన త్యాగాలను చెప్పవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని వారు చూపిన మార్గంలో నడవాలని సమస్య వచ్చినప్పుడు పోరాటం చేసి సాధించుకోవాలని అన్నారు. జాటోత్ ఠాణు నాయక్ సెంట్రల్ యూనివర్సిటీ పేరు పెట్టడం పై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని బంజారాలకు హామీ ఇచ్చారు. గిరిజన తండాలలో మా పాలన మాకే కావాలన్న నినాదం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాములో నెరవేరిందని సబిత తెలిపారు. జాటోత్ ఠాణు నాయక్ విగ్రహాన్ని ట్యాంక్ బండి పై పెట్టాలని, మహానుభావుని జీవిత చరిత్ర ను పాఠ్యపుస్తకాలలో ముద్రించాలని ప్రభుత్వాన్ని కోరారు బంజారా నాయకులు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి రవీందర్ నాయక్,డిఐసిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి,తీగల విక్రం రెడ్డి,అరకల భూపాల్ రెడ్డి, శీను నాయక్, దీప్లాల్ చౌహాన్,అర్కల కామేష్ రెడ్డి, కొలను శంకర్ రెడ్డి, బొక్క రాజేందర్ రెడ్డి, భూపేష్ గౌడ్, మదారి రమేష్ ,పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, విజయలక్ష్మి,సునీత, బాలరాజ్ గిరిజన లంబాడి సోదరులు, నిర్వాహకులు,విగ్రహ దాతలు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు బుద్ధవనంకు అందగత్తెలు

## నాగార్జునసాగర్‌లోని బుద్ధ పార్కు సందర్శన

- 30 దేశాలకు చెందిన మిస్ యూనివర్స్ పర్యటన
- బుద్ధ పూర్ణిమ కావడంతో బుద్ధుడికి పుష్పాంజలి
- అక్కడి విగ్రహాల గురించి వారికి ప్రముఖ బౌద్ధ విశ్లేషకులు వివరణ



**మహా:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మిస్ వరల్డ్ - 2025 పోటీలకు అతిథ్యం ఇస్తోంది. ఇప్పటికే అట్టహాసంగా ప్రారంభమైన ఈ అంతర్జాతీయ అందాల పోటీ 72వ ఎడిషన్‌లో 110కి పైగా దేశాల నుంచి అందగత్తెలు మిస్ యూనివర్స్ కిరీటం కోసం పోటీ పడుతున్నారు. దేశం తరపున మిస్ ఇండియా నందిని గుప్తా పోటీ పడుతోంది. అయితే అందాల భామలు బృందాలుగా ఏర్పడి తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలు, ప్రసిద్ధ దేవాలయాలను సందర్శిస్తారు. ఈ క్రమంలో నేడు నాగార్జునసాగర్‌లోని బుద్ధ పార్కును సందర్శించనున్నారు. బుద్ధ పూర్ణిమ కావడంతో బుద్ధుడికి పుష్పాంజలి ఘటిస్తారు. మహా స్థూపంపై ఉన్న విగ్రహాల గురించి వారికి ప్రముఖ బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వారికి వివరిస్తారు. చివరగా మహాస్థూపం లోపల ధ్యానం చేసి ఐదు నిమిషాల పాటు మాంగ్స్ చాటింగ్‌లో పాల్గొంటారు. అక్కడ ఫొటో సెషన్ తర్వాత బుద్ధవనం చేరుకుంటారు. సుమారు 24 మంది లంబాడా కళాకారులు నృత్యంతో వారికి స్వాగతం పలకనున్నారు. మహా స్థూపం వద్ద స్వాగతం అనంతరం స్థూపం కనిపించేలా ఫొటో సెషన్ ఉంటుంది. ఇందుకు గాను అవసరమైన ఏర్పాట్లు అధికారులు చేశారు. అక్కడి నుంచి మహా స్థూపంలోకి ప్రవేశించిన తర్వాత మహా స్థూపానికి సంబంధించిన వివరాలను పురావస్తు శాఖ ప్రతినిధులు వివరించనున్నారు. అక్కడే ప్రపంచ సుందరీమణులు ధ్యానం తర్వాత ఇక్కడే 25 మంది బౌద్ధ సన్యాసులు బైలికుప్ప మహా బోధి పూజలు నిర్వహిస్తారు. అనంతరం జాతక వనాన్ని సందర్శిస్తారు. బుద్ధవనం ప్రాముఖ్యతను పురావస్తు, టూరిజమ్ ప్రతినిధి శివనాగిరెడ్డి ప్రపంచ సుందరీమణులకు వివరిస్తారు. జాతక వనం సందర్శన అనంతరం బుద్ధ చరితం పై 18 మంది కళాకారులు ఇచ్చే ప్రదర్శన తిలకించిన అనంతరం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

**భారీ భద్రత..**

ప్రపంచ అందగత్తెల భద్రతా దృష్ట్యా పోలీసులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఏరియా డామినేషన్ బృందాల చేత అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నాగార్జునసాగర్ లో దాదాపు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రపంచ సుందరీమణులు బుద్ధ వనాన్ని సందర్శించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో డ్రోన్ల సంచారంపై పోలీసులు నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నాగార్జున సాగర్ వెళ్లే ప్రధాన రహదారితో పాటు సాగర్ లోని పలు పర్యాటక ప్రాంతాలను డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ లతో అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

### నిమిషం లేట్ అయినా

# నో ఎంట్రీ

## రేపే పాలిటెక్నిక్ ఎగ్జామ్

### రాష్ట్రవ్యాప్తంగా 276 పరీక్షా కేంద్రాలు

### పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు రేపు పాలిటెక్నిక్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష కోసం రాష్ట్ర వ్యాప్తంగా 276 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ తెలిపారు. పాలిసెట్ 2025కు రాష్ట్ర వ్యాప్తంగా 1,06,716 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పాలిసెట్ పరీక్ష జరుగుతుందని, విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి ఒక గంట ముందుగానే అంటే ఉదయం 10 గంటలకే అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష ప్రారంభం అయిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించమని స్పష్టం చేశారు. పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులలో హాల్ టికెట్ పై ఫోటో ప్రింట్ కానివారు ఒక పాస్‌పోర్టు సైజు ఫోటో, ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులు తమ వెంట పెన్సిల్, ఏరాజర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ తప్పక తీసుకొని రావాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు కానీ అనుమతించబడవని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ డిప్లొమా చేయాలనుకునే వారు గణితం 60 మార్కులు, భౌతిక శాస్త్రం 30 మార్కులు, రసాయన శాస్త్రం 30 మార్కులకు పరీక్ష రాయవలసి ఉంటుందని, వ్యవసాయం, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా చేయాలనుకునే వారు అదనంగా జీవశాస్త్రంలో మరో 30 మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు.

# స్పెషల్ సెషన్ నిర్వహించాలె

## కాల్పుల విరమణను ట్రంప్ ఎందుకు ప్రకటించారు?

- భారత్‌కు పాక్ నుంచి ఏమి ప్రయోజనం వచ్చింది
- పార్లమెంట్‌లో ఆపరేషన్ సిందూర్ పై చర్చ పెట్టాలి
- ప్రధాని మోదీకి ఖర్గే, రాహుల్ వేర్వేరుగా లేఖలు



**ఢిల్లీ:** భారత్‌పాకిస్థాన్ మధ్య జరిగిన కాల్పుల ఒప్పందంపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎంపీ రాహుల్ గాంధీ వేర్వేరుగా ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పీవోకేను పాకిస్థాన్ ఖాళీ చేయాలని కోరుతూ..1994లో లోక్‌సభ, రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదించబడిన తీర్మానం గురించి వారు పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి తొలుత అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రకటనను ఆ పార్టీ తప్పుబట్టింది. మన దేశ సమస్య అయిన కశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా చేయడాన్ని వ్యతిరేకించింది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్‌పాక్ కాల్పుల విరమణ ఒప్పందంపై తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం మొదలైన విషయాలు చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానిని కోరారు. భవిష్యత్తులో రాబోయే సవాళ్లను ఎదుర్కోడానికి.. భారత ప్రజల సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి ఇది ఒక అవకాశంగా మారుతుందని రాహుల్ అన్నారు. కాల్పుల విరమణ నిర్ణయం తీసుకోవడానికి భారత్‌కు పాక్ నుంచి ఏమి ప్రయోజనం వచ్చిందని ప్రశ్నించారు.

### పీవోకే ఎప్పటికీ భారత్ భూభాగమే..

ప్రతిపక్ష నేతగా మల్లికార్జున ఖర్గే కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు. కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రత్యేక సమావేశంలో తమకు తెలియజేయాలని కోరారు. ఈ విషయంపై కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ.. పీవోకే ఎప్పటికీ భారత్ భూభాగమే అని..దానిని మనం వెనక్కి తీసుకోవాలని అన్నారు. 1994 ఫిబ్రవరి 22న దేశంలో జరిగిన ఉగ్రదాడుల అనంతరం దేశంలో జమ్మూ కశ్మీర్ అంతర్భాగంగా ఉంటుందని లోక్‌సభ, రాజ్యసభ తీర్మానాన్ని ఆమోదించాయని సచిన్ గుర్తు చేశారు. అందులో జమ్మూ కశ్మీర్ ప్రాంతంలో పాక్ అక్రమంగా ఆక్రమించిన ప్రాంతాలను తప్పనిసరిగా వదిలి పెట్టాలని డిమాండ్ చేశామన్నారు. ఈ తీర్మానాన్ని పునరుద్ఘాటించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.

# బషో - హైకు కవితా ప్రక్రియలో తొలి అడుగుల జాడ

జపాన్ కవితా ప్రక్రియలలో హైకు తనకున్న ప్రత్యేకత, ప్రాముఖ్యత వల్ల అంతర్జాతీయ గుర్తింపుతో ప్రపంచ సాహిత్యంలో స్థానాన్ని పదిలపరుచుకుంది. మూడు పాదాలతో 575 మాత్రల రూపంతో ఋతుసంబంధమైన పదం (కిగో) తో హైకు తన ప్రత్యేకతను నిలుపుకునే ప్రక్రియ. తాత్విక చింతనను పుణికిపుచ్చుకుని, ప్రకృతితో తాదాత్మ్యం చెందడం ద్వారానే హైకు ఉద్దేశ్యం నెరవేరుతుంది అని చెప్పవచ్చు . గొప్ప చరిత్ర, నేపథ్యం కలిగిన హైకును ముందుగా 'హొక్కు' అనే పేరుతొ బషో ప్రాచుర్యంలోకి తెచ్చాడు. 'రెంగ' ,'హైకై' అనే గొలుసు పద్యాలలోని మొదటి పద్యానికి ఒక స్వతంత్ర్య పద్యంగా మలిచి 'హొక్కు' గా ప్రవేశబెట్టాడు. జపాన్ లో 1600 సంవత్సరం వరకు 'అషికగ' పాలనలో ప్రజాపోరాటాలలో కొనసాగిన అస్థిరత 1600 సంవత్సరం తరువాత కాలంలో సద్దుమణిగి 'టోకుగవ బయషు' నాయకత్వంలో సైనిక పాలన ఏర్పడింది . ఆ తరువాత 1638 వరకు జపాన్ పూర్తిగా శాంతియుత దేశమై మిగతా ప్రపంచం నుండి వేరుపడి జపాన్ ప్రజలు శాంతి , సుస్థిరత్వంతో కూడిన భద్ర జీవితాలను గడపసాగారు. శాంతి, సుస్థిరత్వం నెలకొన్న కాలంలో 1644 సంవత్సరంలో సెప్టెంబర్ , 15 వ తారీఖున 'ఇగా ' లోని 'యుఎనొ ' ప్రాంతంలో బషో జన్మించాడు . బషో తండ్రి 'యొజమన్' ఒక సన్నకారు రైతు. బషో తన చిన్ననాటి స్నేహితుడైన యొషిటొడ, ఇతని గురువైన కిగిన్ ద్వారా కవిత్వంలోని మెళుకువలు నేర్చుకున్నాడని తెలుస్తుంది. బషో తన పదమూడవ ఏటా మొదటి పద్యం 1657లో రాసాడని చరిత్ర పుటలోకెక్కింది . 1666లో తనకు అత్యంత ఇష్టమైన స్నేహితుడు యొషిటొడ (ఇతను సెంగిన్ అనే కలం పేరుతో కవిత్వం రాసి ప్రసిద్ధికెక్కాడు) మరణంతో వైరాగ్యం చెందిన బషో సన్యాసి జీవితానికి అలవాటు పడినాడు. స్నేహితుడి మరణం జీవితంలో గొప్ప మలుపు తెచ్చి అతని జీవితాన్నే మార్చి వేసింది. వైరాగ్యం చెందిన బషో 'క్యోటో ' కు వెళ్లి గురువు కిగిన్ పర్యవేక్షణలో హైకు సాహిత్యం పై అధ్యయనం మొదలు పెట్టి సాహితీ రంగంలో తనదైన స్థానాన్ని పదిలం చేసుకునే దిశలో సాగిపోతూ కిగిన్



Matsuo Basho (1644 – November 28, 1694)

తో పాటు 'ఇడొ' (ఇప్పటి టోక్యో) ప్రాంతానికి తరలివెళ్లాడు. రెండు సంవత్సరాల తర్వాత ఒక పాఠశాలను ప్రారంభించాడు. అప్పటికి అతని వయస్సు ముప్పై సంవత్సరాలు. మొదటి విద్యార్థిగా ఒక ధనిక వర్తకుడి కుమారుడు చేరాడు. ఈ విద్యార్థి తరువాత కాలంలో కికాకు పేరుతొ ప్రసిద్ధి పొందాడు.


కికాకు ఒకసారి తన గురువైన బషోతో పొలాల వెంట వెళుతూ ఒక దృశ్యాన్ని చూసి హైకు చెపుతాడు .

Red dragonflies
Take off their wings
And they are pepper pods

ఐతే బషో వెంటనే హైకు చెప్పాలనుకుంటే ఇలా చెప్పాలి అంటూ పై హైకును ఈ క్రింది విధంగా సవరిస్తాడు .

Red pepper pods
Add wings to them
And they are dragonflies

దీనివల్ల అర్ధమయ్యేదేమిటంటే హైకును చెప్పాలంటే కవి ముందుగా తాను చూసిన దృశ్యాన్ని అనుభవంలోకి తీసుకోవాలి. కానీ ముందుగానే ఊహాజనితమైన వస్తువును కాదు. ఇక్కడ శిష్యుడు కికాకు ముందుగా 'Pepper pod'' ను చూసాడు. కానీ ఎర్రని తూనీగను కాదు. ఐతే శిష్యుడు ముందుగానే తనకు కలిగిన ఊహా పరిజ్ఞానంతో తూనీగను దృశ్యంలోకి తెచ్చుకొని దాని రెక్కలు విరిచేసి తాను ప్రస్తుతం చూస్తున్న దృశ్యాన్ని అనుభూతించడానికి ప్రయత్నం చేస్తున్నాడు. బషో సవరణలో మరో విషయాన్ని కూడా గమనించవచ్చు . శిష్యుడు ముందుగా తూనీగను దర్శించి దాని రెక్కలు విరిచేయడం చేస్తాడు. తూనీగ ప్రకృతిలోని ఒకానొక అంశం. తూనీగ రెక్కలు విరవడం అంటే ప్రకృతిని ధ్వంసం చేయడం. ప్రకృతిలోని చైతన్యానికి జడత్వాన్ని ఆపాదించడం అవుతుంది. అందుకే బషో దానిని సవరిస్తూ ముందుగా చూసిన Pepper pod ను అనుభవంలోకి తీసుకుంటాడు . దానికి రెక్కలను అమరుస్తాడు. ఆ తరువాత తూనీగను అనుభవంలోకి తీసుకొని ఒక పదచిత్రాన్ని సృష్టిస్తాడు . ఇందులో ఒక నిర్మాణాత్మకమైన (constructiveness ) క్రియాశీలత కనబడుతుంది . హైకులో ప్రకృతి నేపథ్యం అనగా ఇదే అర్ధం . 1679 ప్రాంతంలోనే బషో అందమైన వస్తువులు, దృశ్యాలలో కవిత్వపు సౌందర్యాన్ని అన్వేషించే ప్రయత్నంలో వుండేవాడు. తన శైలిని మెరుగుపరుచుకుంటూ కవిత్వపు లోతుల్ని తాకాలని తపనపడేవాడు. రెండేళ్ల తరువాత అనగా 1681 లో మనసు మార్చుకొని బుద్ధిజం శాఖలోని 'జెన్' ను ఆశ్రయిస్తాడు . సాంప్రదాయం, తత్త్వం, కవిత్వం ఈ మూడు బషోకు ప్రాణప్రదమైనవి. జీవితపు చరమ దశలో కూడా ఈ మూడింటినే మిత్రులు, విద్యార్థులతో చర్చిస్తూ ఉండేవాడు. బషో బాల్యంలోని పేరు మత్సువొ మ్యూనిఫ్యూస. 1694లో మరణించిన బషోకు నలుగురు సోదరీమణులు , ఒక అన్న ఉండేవారు. బషో కు ఇద్దరు కుమారులు, ఒక దత్తపుత్రుడు. సాత్వికుడు, తాత్వికుడు, వేదాంతి , యాత్రికుడు అంతకు మించి గొప్ప "హైకు మాస్టర్" బషో.



- డా . రూప్ కుమార్ డబ్బీకార్,
91778 57389

# పిల్లలూ - పెద్దలూ

## కథ

**తమిళ కథ.. పుదువై చంద్రహరి**
**అనువాదం.. నలిమెల భాస్కర్**



- నలిమెల భాస్కర్, 97043 74081

"ఏమండీ చూసారా?మనబ్బాయి ఆనందన్ లెక్కల నోట్సులో ఈ బొమ్మ ఉందండీ!"నాలుగు భాగాలుగా మడచి వున్న ఓ వారపత్రికలోని కాగితాన్ని భర్తకిస్తూ అంది పూరణి.

ఖంగు ఖంగుమని దగ్గుతూనే ఆ కాగితాన్ని చూసి విస్తుపోయాడు.అది దాదాపుగా ఒక స్త్రీ నగ్నచిత్రం. 'తన కొడుకు బంగారు కొండ.వాడు మిగిలిన పిల్లల్లా కాదు.ఒక లక్ష్యంతో చదువులో ఎంతో శ్రద్ధగా ఉంటున్నాడు.ఎలాగైనా ఈ ఇంటర్ లో చక్కని ర్యాంక్ తో పాసై ఇంజనీరింగ్ కాలేజీలో చేరటం గ్యారంటీ'అని నమ్మిన తలిదండ్రులకు ఇది శరాఘాతం లాంటిదే! "చాన్నాళ్ళుగా రాత్రి పొద్దుపోయేవరకు చదువు తున్నాడనుకుంటే ఇదా సంగతి?"

"వయస్సు మహత్యం పూరణీ!పిల్లలందరూ ఇంతే! పత్రికలూ,టీవీలూ చెడగొట్టేందుకే వున్నాయి. విధిరాత తప్పదు.వెళ్ళు.మళ్ళీ అక్కడే పెట్టు ఆ కాగితాన్ని." మర్నాడు ఉదయం ఆయన తన ఆస్తమా బాధ తట్టుకోలేక ఊపిరి కోసం ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. దగ్గు తెరలు తెరలుగా కమ్ముకొస్తోంది. వాళ్ళ అబ్బాయి పరుగున వచ్చి"నానా!ఇటీవల పేపర్లో ఒక ఆస్తమా యాడ్ చూసాను.అది చాలా చక్కటి ఔషధమట!దాన్ని కట్ చేసి వుంచాను నానా"అంటూనే ఆ ప్రకటన ఉన్న కాగితాన్ని ఇచ్చి వెళ్ళాడు.ఆయన ఆ కాగితాన్ని తిప్పి చూసేసరికి వెనకవైపు సెక్స్ బొమ్మ.

వెంటనే భార్యన కేకేస్తూ"పూరణీ!నిన్న మన కళ్ళు ఈ యాడ్ ని గమని చలేదు. మనబ్బాయిని సెక్స్ బొమ్మ గురించి అడగందమంచిదైంది.అడిగితే ఎంత చులకనగా మన గురించి ఒక అభిప్రాయం ఏర్పరచుకొని వుండేవాడు!పిల్లల గురించి అనవసరంగా భయపడిపోయే పెద్దలకు ఓ దురభిప్రాయమే ఉంటుంది పూరణీ!నిజానికి మనమ పిల్లలం...కాదు కాదు అల్పులం"అన్నాడు. పూరణి సిగ్గుతో తల దించుకుంది .

# చిగురిస్తున్న ఆశలు



గతం వర్తమానాన్ని నిలబెడుతుందని
అది రక్త మాంసాలను
నరాలకు ఎక్కిస్తుందని
వర్తమానం రేపటి గెలుపుకు
జవజీవాలిస్తుందని నమ్మినవాళ్లు
నమ్మకాన్ని భుజాన వేసుకొని తిరిగిన వాళ్ళు
వాళ్ళు వస్తారు
తప్పకుండా వస్తారు

వాళ్ళకోసం
సూర్యుడు సందె చెరువులో
దిగకుండా ఎదురు చూస్తున్నాడు

రాత్రి చీకటిని కప్పుకోకుండా
మిణుగురు పూల దారులు పరుస్తున్నది
కొట్టంలో పాలబర్రె
మేతని దవడ కిందనే ఆపి
రెప్పలాపి చూస్తున్నది
లేగదూడలు తల్లికోసం కండ్లు పారేసుకున్నట్టు
వాళ్ళకోసం చూపుల్ని దారులకిరువైపలా
కాపలా పెట్టారు


వాళ్ళక్కడ ఉండడం అన్యాయమని
ఆ ఇనుప గజాల గోడలకు తెలుసు
వాళ్ళు తినే పళ్లెంలో ఒలికిన
దుఃఖానికి తెలుసు
దేశం పట్టనంత ఉద్రేకాన్ని
జీవితం భరించనంత
ఉక్రోశాన్ని భరిస్తున్న
మునిపంటి పదునుకూ తెలుసు

మాటిమాటికి
కండ్ల జల పాతాల్లోంచి దూకుతూ
ఇంత దాష్టికాన్ని నిర్ధయను
ఎగజిమ్ముతున్న
వేడి నిట్టూర్పు ధారలకూ తెలుసు
దుఖాన్ని తుడుచుకుంటున్న
మణికట్టుకూ తెలుసు
వాళ్ళు వస్తారని
తప్పకుండా వస్తారని
వాళ్ళు తప్పకుండా వస్తారని.



- డా.ఉదారి నారాయణ,
9441413666

# కలగన్న కల



మధుబాల పూల అందాన్ని
తుమ్మెదనై చూస్తున్నాను

కిశోర్ ఇటే వస్తున్నాడు
తన గురించి ఓ మాట అడగాలి

నూతన్ ఓరచూపునుంచి
రెండు దమ్ములు లాగి సేద తీరాలి

ఇంకా ఈ ఒంటిని
సుడిగాలి కలలు తాకలేదు

గురుదత్తు అడగాలి
ప్యాస ముడి విప్పమని

ఆ వానలో పరుగెడుతున్నదెవరు
మీనానేనా...
సమయానికి గొడుగు కూడా లేదే !

మన్నాడే మేష్టారు...
ప్లీజ్ ! గొడుగిస్తారా ...

ఈ కాఫీ చేదుగా లేదే
ఇక్కడెక్కడో నూర్జాహాన్
పాట తీపి ఒలికి ఉండాలి

సురయ్యా అలా వెడుతుందేం
స్వరపాతంలో గుక్కెడు మధువు
ఇంకా ఒలకనేలేదు

రఫీ సాబ్ను అడగాలి
మీ గొంతులో స్వర్గ ద్వారముందాని

ఆ గుర్రపు బగ్గి దిగేది
ఓపినయ్యరే కదూ ...
నా వద్ద ఇచ్చుకోవడానికి ఏమీ లేదే !

మెహదీ హసన్ సాబ్ ...
మీ పూలబొకే నుంచి ఓ గులాబీ ఇస్తారా

ఇష్టునికి పూల రేకులతో స్వాగతిస్తాను

ఆశాజీ ఈ దారి వచ్చి వెళ్ళినట్టుంది
వాడిన తోట చెప్పకనే చెబుతోంది
చిగురించి

అక్కడ తచ్చాడుతోన్నది దేవానంద్ కదూ !
పాపం ! సిగరెట్టు వెలిగించుకోవడానికి
లైటర్ లేనట్టుంది దిక్కులు చూస్తున్నాడు
అగ్గి వెలిగించి సెల్ఫీ దిగి వస్తాను.

- తెలుగు వెంకటేష్, 99853 25362

# శిలారాశి



అదీ ఏం పక్షో
నాకు తెలియదు

కనులు మూయగానే
అరుస్తోంది
కనులు తెరిచేసరికే
ఎగిరిపోతోంది

నెత్తురోడిన
అడవి దుఃఖాన్ని
గేయం చేసుకొని
వినిపిస్తోంది

ఏ సమూహానికైనా
సందేశమిస్తోందా
జాగృత పరుస్తోందా
తడి గుండెలను
అతికిస్తోందా

లేదా తనకు తానే
సాంత్వన పడుతోందా
అర్థం కావడం లేదు

నిన్న సూర్యోదయ వేళ
మా వాకిట్లో పక్షి ఈకలు
కుప్పపడి ఉన్నాయి

నాకు కళ్ళు మూయాలంటే
ధైర్యం చాలడం లేదు

పక్షి వస్తుందో రాదో
ఏ డేగైనా
తన్నుకు
పోయిందోనేమోనని
భయంగా ఉంది

- పర్కపెల్లి యాదగిరి,
9299909516

## పాత బంగారం - 3

# మహాయాత్ర నవల

'మహా యాత్ర" ఒక సైన్స్ ఫిక్షణ్. నవలా నాయిక ఆశ. ఆత్మహత్య చేసుకునే ఉద్దేశం ఉన్నవారు తనను సంప్రదించాలని ఆశ ఒక పేపర్ ప్రకటన ఇస్తుంది. ఆమె ఒక సైంటిస్ట్. తాను రూపొందించిన ఒక వాహానంతో రోదసి యాత్ర చేసి దృవ నక్షత్రం చేరాలన్నది ఆమె ఆలోచన. దీనికి ప్రభుత్వ సహకారం కూడా ఉంది. అయితే ఆ యాత్ర చాలా కష్టసాధ్యం అని అందుకని జీవితం పట్ల ప్రేమ లేని వ్యక్తులయితే వారు మరణించినా పెద్దగా నష్టపోయేదేమీ ఉండదని ఆ ప్రకటన ఇచ్చానని చెబుతుంది. నిరుద్యోగిగా ఆకలి కష్టాలు పడుతున్న ఆనంద్ ఆతనితో పాటు ఉడత అనే ఒక అనాధ బాలుడు ఈ యాత్రకు ఆశతో పాటుగా బయలుదేరుతారు. ఎన్నో ప్రయాసలకు ఓర్చుకుని దృవ నక్షత్రం చేరుకుంటారు.

అక్కడ రాజు దృవుని సంతతికి చెందిన వ్యక్తి. అక్కడి ప్రజలు స్వేచ్చా ప్రియులు. నగ్నంగా తిరుగాడుతూ ఉంటారు. సిగ్గు బిడియం, మానవ అనుభూతులకు ఆకలికి కూడా వారు దూరం. వారితో కలిసిపోవడం కొంత కష్టం అనిపిస్తుంది వీరికి. కాస్త అలవాటు పడ్డాక అక్కడి మనుష్యుల స్వేచ్ఛా జీవనం వారికి నచ్చుతుంది. ఆనంద్ దివా అనే స్త్రీతో అనుబంధం పెట్టుకుంటాడు. ఎటువంటి కోపతాపాలు లేకుండా స్త్రీని పురుషులు పంచుకోవడం, పురుషున్ని స్త్రీలు పంచుకోవడం ఆశ్చర్యపరిచినా, ఆనంద్ ఆ పద్ధతికి త్వరగా అలవాటుపడతాడు. దివాతో పాటు మరో ఉన్నత స్థాయి స్త్రీ కోరి అతనిని చేరితే ఆమెతో కూడా గడుపుతాడు. అయితే విరహం, దుఖం లాంటివి ఎరుగని దివా లాంటి స్త్రీలూ అతన్ని కొంత అశ్చర్యానికి గురి చేస్తారు.




మరో పక్క ఆశ దృవుడితో ప్రేమలో పడుతుంది. దృవుడు అప్పటికే మోహినీ ప్రేమలో ఉంటాడు. తనకు మానవ అనుభూతులను ఆస్వాదించాలని ఉందని మోహిని ఆశ రక్తం ఎక్కించుకుంటుంది. తరువాత మనుష్య జాతి స్త్రీ లలో వలే అసూయ ఆమెలో ప్రవేశిస్తుంది. దృవుడిని ఆశతో పంచుకోవడం ఆమెకు బాధ కలిగిస్తుంది. ఆశ కూడా ఈ ప్రేమలో అంతులేని వేదనను అనుభవిస్తుంది. దృవుడిని వివాహం చేసుకోవాలని కోరుకుంటుంది. దృవుడు కూడా దీనికి అంగీకరిస్తాడు. కాని ఆమెలో కల్లోలాన్ని అర్ధం చేసుకోలేకపోతాడు. ఆమె ప్రేమకి భూమీ మీద నివసించే ప్రాణిలా స్పందించ లేకపోతాడు. ఆశతో సుఖించాలనుకుంటాడు. కాని మోహిని బలవంతం మీద తనకు ఈ ప్రేమ దక్కదని ఎప్పటికీ సొంతం కాదని తెలుసుకుని ఆశ భూలోకానికి తిరిగి వచ్చేయవలసి వస్తుంది.

అయితే దృవుడిని వదిలి రావడం ఆశను చాల బాధిస్తుంది. అతన్ని పొందలేకపోవడం ఇంకా బాధపెడుతుంది. విపరీతమైన వేదనను అనుభవిస్తుంది. భూమికి చేరే సరికి ఐదు సంవత్సరాలు గడిచిపోతాయి. ప్రేమ ఇచ్చిన దుఖంతో ఆమె త్వరగా ముసలిదయి పోతుంది. అయితే మరో పక్క ఆనంద్ తనను నవ్వుతూ వదిలివేసిన దివాను మర్చిపోతాడు. ఆ అనుభవం ఇచ్చిన ఆనందం ఆస్వాదించి, ఏ బంధనాలు కోరని ఆమె సమాగమనాన్ని సంతోషంగా విస్మరించి ఆ బంధంలో అవసరం లేని గిల్ట్ కి సంతోషిస్తూ భూమి పైకి చేరి చాలా ఆనందంగా ఇక్కడ సౌకర్యాలు అందుకుని జీవిస్తూ ఉంటాడు.

కాని ఆశ తన ప్రేమను మర్చిపోలేకపోతుంది. మరొకరికి సొంతం అవలేకపోతుంది. జీవితం పై కోరిక చనిపోతుంది. తన పని పై కూడా శ్రద్ద పెట్టలేకపోతుంది. ఒక సారి ఏదో గ్రహం నుండి భూమికి సంకేతలు వస్తున్నాయని ఆమెను శాస్త్రవేత్తలు పరిశీలించమన్నప్పుడు దృవుడు తన క్షేమం విచారిస్తున్నాడని అర్థం అయి ఆ ఆనందంతో మరణిస్తుంది.

ఈ నవల చదివిన కొంత సేపటికి గాని ఈ పాయింట్ స్పురించలేదు. స్వేచ్చలో ప్రేమను ఆస్వాదించడం పురుషుడికి స్త్రీకి ఒకేలా జరగదు. స్త్రీ తన ప్రేమకు కట్టుబడి ఉండిపోవాలని కోరుకుంటుంది. అదే ఆమె జీవితాన్ని నడిపించే చుక్కాని అవుతుంది. కాని పురుషుడికి అది ఒక అనుభవం మాత్రమే. అది భాద్యతగా మారకపోతే ఆనందపడతాడు, తన జీవితంలోకి ఒదిగిపోతాడు. కాని ఆ పని స్త్రీ చేయలేదు. అశ, ఆనంద్ ఇద్దరి అనుభవాలు ఒకటే, స్త్రీకి ఆది అంతులేని దుఖాన్ని మనోవ్యధను ఇస్తే, పురుషుడికి ఒక అందమైన అనుభవాన్ని ఇస్తుంది. ప్రియుడు లేని జీవితం స్త్రీని అసహాయురాలిగా చేస్తె పురుషుడుకి అంతులేని ఆత్మవిశ్వాసం ఇచ్చి అదే అనుభవం అతన్ని ముందుకు నడిపిస్తుంది. ధ్రువుడిలోని ప్రేమ మాత్రమే ఆశ మనసును తాకగలదు. చివరకు ఆ ప్రేమ పిలుపు విన్న తరువాతే ఆమె మరణిస్తుంది. గ్రహాలు మారినా, తరాలు మారినా ప్రేమ పట్ల స్త్రీ పురుషుల స్పందన ఎప్పటికీ ఒకేలా ఉండదు అన్నది రచయిత్రి భావనా??? ఎమో మరి ఈ నవల నాకు అలాగే అర్ధం అయింది.



- పి.జ్యోతి,
98853 84740

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

## భారత సైనికుడు మురళి నాయక్‌కు ఘనంగా నివాళులు అర్పించిన నందు నాయక్




**బాలాపూర్ మహా:** నందు ఆర్మీ ఫిజికల్ ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యం లో పాకిస్తాన్ లో జరుగుతున్న సరిహద్దు ఘర్షణ లో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన భారత సైనికుడు మురళి నాయక్ సానుభూతి తెలియజేస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళి నాయక్ మరణ వృధా కాదని పాకిస్తాన్ పై ప్రతీకార చర్య తీవ్రంగా ఉంటుందని అన్నారు. భారతదేశాన్ని టచ్ చేయాలంటే భయపడే పరిస్థితికి పాకిస్థానీ వస్తుందని తెలిపారు. భారత త్రివిధ దళాలకు,భారత ప్రభుత్వానికి దేశ ప్రజలందరూ మద్దతుగా ఉన్నారని పాకిస్తాన్ ప్రపంచ చిత్రపటం లో లేకుండా చేయాలని కోరారు. మన భారత సైనికుల పోరాటంతో మనం ఇక్కడ క్షేమంగా ఉండగలుగుతున్నామని వారి ధైర్య సాహసాలు చరిత్ర పుటలలో నిలిచిపోతాయని నందు నాయక్ తెలిపారు. పాకిస్తాన్ దూత్సాహసానికి భారీ మూల్యం చెల్లించుకొక తప్పదని హెచ్చరించారు.

## వీరమరణం పొందిన జవాన్లకు ఏబిసిడి డాన్స్ అకాడమీ ఘన నివాళి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహత్యం:** పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొంది, భూమాత ఒడిలో సేద తీరుతున్న ఆర్మీ జవాన్లు మురళి నాయక్, సచిన్ యాదవ్ రావ్ వనాంజేకు ఆత్మ శాంతి చేకూరాలని కొవ్వొత్తులను వెలిగించి, మౌనం పాటించి, ఘనంగా నివాళులు అర్పించిన ఇబ్రహీంపట్నం ఏబీసీడీ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు నిర్వాహకులు. దేశ భద్రత కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన మురళి నాయక్, సచిన్ యాదవ్, రావ్ వనాంజేల త్యాగాలను ఎన్నటికీ మరువలేనిది. దేశ రక్షణలో ఆర్మీదే ముఖ్య పాత్ర. యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు, డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు సలాం చేశారు. వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలనీ కోరారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డ్యాన్స్ అకాడమీ మాస్టర్ ముత్యం అన్నారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ సురేశ్, బన్నీ, తార తదితరులు పాల్గొన్నారు.

# ఆదిభట్ల మున్సిపాలిటీలో నామమాత్రంగా కూల్చివేతలు

ఉన్నతాధికారుల మెప్పుకోసం మున్సిపల్ కమిషనర్ కూల్చివేతలు

మున్సిపల్ కమిషనర్ ఆదేశాలను బేఖాతరు చేసిన భవనాల యజమానులు

జి ప్లస్ టు అనుమతులు జి ప్లస్ ఫోర్ నిర్మాణాలు

ఆదిభట్ల మున్సిపాలిటీలో 13 అక్రమ నిర్మాణాలు పాక్షికంగా కూల్చివేత

కూల్చివేత అనంతరం కొనసాగుతున్న నిర్మాణ పనులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

మున్సిపాలిటీలో ఇప్పటివరకు దాదాపు 100 జి ప్లస్ ఫోర్ భవనాలు వెలిశాయి. మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న అక్రమ భవనాలను పట్టించుకోకపోవడం దారుణమని, జి ప్లస్ టు అనుమతులు తీసుకొని, జి ప్లస్ ఫోర్ నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించిన భవనాలను, మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ, తన సిబ్బంది పాల్గొని నామమాత్రంగా కూల్చివేశారు. మున్సిపాలిటీలో మంగళపల్లి, ఆదిభట్లతో పాటు పలు వార్డులలో మున్సిపాలిటీ అనుమతి లేకుండా అక్రమంగా నిర్మించిన భవనాలను, ఉన్నతాధికారుల మెప్పు కోసం నామమాత్రంగా కూల్చివేసి ముఖం చాటేశారు. కూల్చివేసిన అనంతరం నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిన, ప్రభుత్వ మాటలు బేఖాతరు చేస్తూ భవన నిర్మాణ యజమానులు, రియల్ ఎస్టేట్ దారులు విచ్చలవిడిగా అక్రమంగా నిర్మాణాలు చేపట్టి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ వారి సిబ్బందితో అక్రమ నిర్మాణాలు నాలుగో అంతస్తులో కూల్చివేస్తుండగా, భవన యజమానులు మూడో అంతస్తులో నిర్మాణ పనులు కొనసాగిస్తూనే ఉన్నారు. అక్రమంగా భవనాలు నిర్వహించిన యజమానులకు నోటీసులు జారీచేసిన, భవనాల యజమానులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ, తమ పని తామే చేసుకుంటూ ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ అక్రమ భవన నిర్మాణాలను పాక్షికంగా కూల్చివేసి చేతులు దులుపుకున్నారు. దీంతో భావన నిర్మాణ యజమానులు మాత్రం మళ్లీ తమ పనిని సాఫీగా చేసుకుంటూ వెళ్తున్నారు. మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న మున్సిపల్ సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరించడం అక్రమదారులకు అలుసుగా మారింది.

**పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి...**

ఆదిభట్ల మున్సిపాలిటీలో పలు ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలంటే పోలీసు బందోబస్తు మున్సిపల్ సిబ్బంది అధికారుల బృందం పర్యటించి, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి. కూల్చివేతల సమయంలో ఎలాంటి పోలీస్ బందోబస్తు లేకుండా మున్సిపల్ కమిషనర్, తన సిబ్బంది మాత్రమే అక్కడికి వచ్చి అక్రమ నిర్మాణాలను పాక్షికంగా పోల్చడంతో పలు అనుమానాలకు వ్యక్తమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**కమిషనర్ పై భవన నిర్మాణ యజమానులు ఆగ్రహం...**

ఆదిభట్ల మున్సిపల్ పరిధిలో పలు వార్డులలో ఎంతోమంది అక్రమ నిర్మాణాలు చేపట్టిన వాటిని కూల్చివేయకుండా, కక్షపూరితంగా వ్యవహరించి తమ భవనాలను కూల్చివేయడంలో అంతర్యం ఏమిటని, ఎంతవరకు సమంజసం అని భవన నిర్మాణ యజమానులు కమిషనర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ కు మిగతా భవన నిర్మాణ యజమానులు రహస్యంగా ముడుపులు ఇచ్చారా? వారిని వదిలి ప్రత్యేకంగా మా నిర్మాణాలను కూల్చివేయడం కాసుల కోసమా, కక్ష సాధింపు చర్యల అంటూ మండిపడ్డారు. కమిషనర్ పక్షపాతంగా వ్యవహరించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

**మున్సిపల్ కమిషనర్ పై విమర్శలు...**

మున్సిపల్ కమిషనర్ కు అక్రమ భవ నిర్మాణాలపై చిత్తశుద్ధి ఉంటే మంగళపల్లి, బొంగులూరు, ఆదిభట్ల కొంగరతో పాటు పలు వార్డులలో పుట్టగొడుగులా వెలుస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదిభట్ల మున్సిపాలిటీ వాస్తవ్యులు పల్లె శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. అక్రమంగా నిర్మిస్తున్న బడా బాబుల నిర్మాణాలను వదిలేసి, నిద్ర మత్తులో కంటికి కనిపించిన భవనాలను కూల్చి ముఖం చాటేసారని విమర్శించారు.

**మున్సిపల్ టిపిఓ సహకారంతో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు...**

ఆదిభట్ల మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సహకారంతో పలు వార్డులలో విచ్చలవిడిగా భవన నిర్మాణాలు కొనసాగుతున్న, ఆమె మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరించడంతో, అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పలు వార్డులలో పర్యటించి పునాదులు చేపట్టే సమయంలో హెచ్చరికలు జారీ చేస్తే అక్రమ నిర్మాణాలకు తావుండదు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ చుట్టూచూపులాగా విధులకు హాజరు కావడంతో, ఆడింది ఆట పాడింది పాటగా వ్యవహరిస్తూ ఎక్కడపడితే అక్కడ అక్రమార్కులు అక్రమ భవనాలు నిర్మిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఇచ్చినటువంటి జి ప్లస్ టు అనుమతులను, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తే జి ప్లస్ ఫోర్ నిర్మాణాలకు చోటుండదని, కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమ సిబ్బందిని ఫీల్డ్ వద్దకు పంపిస్తే ఇలాంటి దుష్ఫలితాలు వస్తాయని పలువురు ఆరోపిస్తున్నారు.

## సృష్టికి మూలం అమ్మ... అమ్మను మించిన దైవం లేదు

### అమ్మ రుణం కోటి జన్మలెత్తిన తీర్చలేనిది..

మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజిని సాయిచంద్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

ప్రపంచంలో అమ్మ లేని ఊరు, దేశం లేదని, సృష్టికి మూలమే తల్లి అని మాజీ ఐపీఎస్ అధికారి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజిని సాయిచంద్ అన్నారు. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్ అధ్యక్షతన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కడ్తాల పట్టణంలోని స్థానిక అంగన్వాడీ సబ్ సెంటర్లో, మండలంలోని గర్భిణీ మహిళలకు న్యూట్రీషియన్, మెడికల్ కిట్లను తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తాతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... అమ్మతనం మాటల్లో వర్ణించలేనిది.. అక్షరాల్లో రాయలేనిది"అమ్మ ప్రేమ అమ్మ"ఈ సృష్టిలో తీయ్యని పదం.. వెలకట్టలేని అమ్మ ప్రేమ.. అపూర్వమైన బంధం అమ్మ ఈ జన్మలో మనం చూసే ఆస్వాదించే ప్రతి సమయం ప్రతీ క్షణం మన మాతృమూర్తి అమ్మ చూపే అనురాగం మరెవ్వరు చూపలేరనీ వారన్నారు. అమ్మ చూపే ఆప్యాయతలో ఇంకెవ్వరు సాటిరారు. నా జీవన ప్రయాణంలో అనునిత్యం నన్ను దీవిస్తూ, నన్ను ప్రేమించే నా అమ్మ అని వర్ణించారు. ప్రస్తుత తరుణంలో యువత చెడు అలవాట్లకు బానిసై అమ్మతనాన్ని మరచి కొంతపుంతలు తొక్కుతున్నారని అలాంటి వారిని ఆ దైవమే రక్షించాలని అన్నారు.



భారతదేశం సాంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని, మాతృమూర్తి గొప్పతనాన్ని ఆనాడే సమాజానికి చాటి చెప్పారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 240 మంది గర్భిని మహిళలకు మెడికల్ కిట్లను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సతీమణి మంజుల, కుమారుడు కోడలు డాక్టర్ అనిల్, డాక్టర్ భావన, మాజీ ప్రజా ప్రతినిధులు మాజీ జెడ్పిటిసిలు జరుపుల దశరథ్ నాయక్, విజితా రెడ్డి, చంద్రమౌళి, లచ్చి రామ్ నాయక్, నరసింహ, సాయిలు, లక్ష్మీ నరసింహ రెడ్డి, తలకొండపల్లి మాజీ సర్పంచ్ జ్యోతయ్య తల కొండపల్లి మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయక్, గంప శ్రీనివాస్ గుప్తా, బిఆర్ఎస్ పార్టీ నాయకులు శంకర్, కొమ్ము శ్రీనివాస్ యాదవ్, గోపాల్ నాయక్, సిద్ది గారి సురేష్, కొప్పు శ్రీకాంత్, ఒగ్గు మహేష్, కంబాలపల్లి శ్రీకాంత్, గణేష్, పోతుగళ్ల మహేష్, రంగయ్య, రమేష్, సాయిలు, లాల్కోట జంగయ్య, రామకృష్ణ, యాదయ్య, రమేష్, మహేష్, లాయక్ అలీ, రవి తదితరులు పాల్గొన్నారు.

# చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం కూల్చివేయడం హేయమైన చర్య

### తినే కుడులో మట్టి పోస్తున్నారు

**చెప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కుల్చాడన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం**

**చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని వెంటనే పున: ప్రారంభించాలి**

**సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్టకింద ఉన్న చాప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్ వెస్లీ, టీఎంకెఎంకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య, టీఎంకెఎంకేఏ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామేల్, కె జగన్, టీఎంకేఎంకేఎస్ జిల్లా అధ్యక్షులు చనమోని శంకర్ తో కలిసి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్ట క్రింద ఉన్న చేప పిల్లలను ఉత్పత్తి చేసే 9 ట్యాంకులను ఎందుకు కూల్చారని మత్స్యకార సంఘాలతో చర్చించకుండా కనీసం సమాచారం ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని వల్ల మత్స్యకారులకు నష్టం వాటిల్లుతుందని వెంటనే చెప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పున నిర్మాణం చేయాలని, అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 32. చెప పిల్లల ఉత్పత్తి కేంద్రాలలో కూడా స్థలాలు కబ్జాలకు గురై సరైన సిబ్బంది లేకపోవడం వల్ల చెప పిల్లలు ఉత్పత్తి చేయలేక తెలంగాణ రాష్ట్రానికి సూమరు 400 కోట్ల రూ,, చేప పిల్లలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెచ్చుకుంటున్నారని ఇక్కడ సిబ్బందిని కేటాయించి ఉత్పత్తి కేంద్రాల అభివృద్ధి కోసం 500 కోట్ల రూ,,కెటాయిస్తే ఇక్కడ నుండే చేప పిల్లలను ఉత్పత్తి చేసుకోవచ్చని దాని కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాస్తామన్నారు. మే 15న మత్స్యకారులు నిర్వహించే మహా ధర్నాకు సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం కాల్చడం అంటే దుర్మర్గమైన చర్య అన్నారు అధికారుల వల్ల జిల్లాలో ఉన్న మత్స్య సొసైటీలకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యధావిధిగా చెప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్న వెంటనే ఎర్పాటు చేయాలని చేపల మార్కెట్ అనే పేరుతో కాంట్రాక్టర్లు, కొంతమంది మత్స్య శాఖ అధికారుల కమీషన్ల కోసం చేపల మార్కెట్లు కడుతున్నారని మత్స్యకారులకు ఉపాయోగం లేని స్థలంలో కట్టడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఇబ్రహీంపట్నంలో జన సాంద్రత ఉండే చోట నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో మత్స్యకారులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ... మత్స్యకారుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం అయ్యిందని మత్స్యకారులకు సరైన బడ్జెట్ కేటాయించలేదని శీలా పలకలు వేస్తున్నారు తప్ప బడ్జెట్ మాత్రం కేటాయించక పోవడం దుర్మార్గమని ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. మత్స్యకారులకు అండగా సిపిఎం పార్టీ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా మాట్లాడుతూ... ఉత్పత్తి కేంద్ర కుల్చడం మంచిది కాదని ఇక్కడ ఉన్న భూమి సర్వేచెయించి అద్దురాళ్లు ఎర్పాటు చేయాలని, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం పున:నిర్మాణం చేసే వరకు మత్స్యకారుల ఐక్యం చేసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

**బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే**

**వరంగల్ మహా;** జిడబ్ల్యూ ఎంసీ ప్రధాన కార్యాలయంలో మే 12వ తేదీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి గ్రేటర్ వరంగల్ నగర ప్రజలు ఫిర్యాదులు ఇచ్చుటకు బల్దియా కార్యాలయానికి రాకూడదని కమిషనర్ కోరారు.



## చిన్నారులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హన్మకొండ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 44వ డివిజన్ పరిధి లోని కడిపికొండ సూర్యక్యాటరీ లోని పుష్కర రిసార్ట్ నందు ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుమార్తె పుప్పాల మానస ఓంప్రకాష్‌యెక్క చిన్నారులు విరూపాక్షి, వామదేవ్ ల మొదటి సంవత్సరం జన్మదిన వేడుకల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ , జిల్లా కాంగ్రెస్ నాయకులు జున్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వేములనర్వలో తవ్వకాల కలకలం?

### గతంలోనూ తోకలు జరిపిన ఆగంతకులు.. తోవ్వకాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారంటూ కలకలం రేగింది. గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ పొలంలో రెండు మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీ సహాయంతో తవ్వకాలు జరిపారు. అటుగా వెళ్లిన కొందరు దీనిని గమనించిన గ్రామస్తులకు విషయము తెలపడంతో గుప్త నిధుల కోసమే తవ్వకాలు జరిపినట్లు గ్రామంలో గుసగుసలు వినిపించాయి. గతంలో కూడా ఈ వ్యవసాయ పొలంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు తెలిపారు. మళ్లీ ఇన్ని సంవత్సరాల తర్వాత ఇలా గుట్టు చప్పుడు కాకుండా తవ్వకాలు జరపడంతో గ్రామంలో కలకలం రేగింది. ఈ సంఘటనకు పాల్పడిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను గ్రామస్తులు కోరుతున్నారు.



## పుష్కర స్నానానికి కాళేశ్వరం రానున్న గవర్నర్

**కాటారం, మహా :**

ఈనెల 15వ తేదీ నుండి కాళేశ్వరం లో ప్రారంభమయ్యే సరస్వతి పుష్కర స్నానానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రానున్నారు. శుక్రవారం దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు లు గవర్నర్ ని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఖరారైంది. తర్వాత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర కేంద్ర మంత్రులు పుష్కరాలకు కాళేశ్వరం కు తరలిరానున్నారు. ప్రముఖ సినీ తారలు ఇతర వీఐపీలు పుష్కరాలు స్నానాలకు తరలివచ్చే అవకాశం ఉందని సమాచారం. పుష్కర ఘాట్ లో విఐపి ల కోసం ప్రత్యేకంగా బార్కేర్లతో వీఐపీలు పుష్కరసాను ఆచరించేందుకు తగిన ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదివారం అధికారులను ఆదేశించారు. భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.



ROBOTICS TECHNOLOGIES
WWW.ROBOTICSTECHNO.COM

WWW.ROBOTICSTECHNO.COM

# URGENT JOB OPENINGS FOR HUMAN RESOURCES (HR) SPECIALISTS

**FREE FULLY AIR-CONDITIONED (AC) WOMEN'S HOSTEL**

**SALARY : RS. 14,000/- PER MONTH**
**VERY LIMITED HOSTEL VACANCIES**

**QUALIFICATION : BACHELORS**

**EXPERIENCE : FRESHERS**

- FREE HOSTEL ACCOMMODATION NEARBY OFFICE
- FREE FULLY AIR-CONDITIONED (AC) WOMEN'S HOSTEL
- SALARY HIKE: AFTER COMPLETING 6 MONTHS
- HR SPECIAL INCENTIVES & BONUSES
- FREE WI-FI, TV & QUALITY FOOD IN THE HOSTEL
- WORKING DAYS: MONDAY TO FRIDAY (US TIMINGS) ONSITE
- WEEK-OFFS: SATURDAY & SUNDAY
- JOB LOCATION: BANJARA HILLS, HYDERABAD
- EXCELLENT ENGLISH COMMUNICATION REQUIRED



**INDIA BRANCH**
43/A/1, RD NO. 12, UNION BANK ATM LANE MLA COLONY, BANJARA HILLS HYDERABAD-34

**TEXAS BRANCH**
423 W WHEATLAND RD, SUITE 103A, DUNCANVILLE
TEXAS 75116-4605. UNITED STATES

**VERMONT BRANCH**
69 ALLEN ST RUTLAND
VERMONT 05701, UNITED STATES

**OKLAHOMA BRANCH**
322 N 3RD AVE,
DURANT, OKLAHOMA 74701,
UNITED STATES

**NEBRASKA BRANCH**
6395 LOCUST ST,
GRAND ISLAND
NEBRASKA 68801,
UNITED STATES

**INTERVIEWS TIMINGS**
**11 AM TO 1 PM**

HR RECRUITER PHONE
**95159 79925**

OFFICE PHONE:
**99085 31646, 80196 01108**

## INTERVIEWS ADDRESS
43/A/1, RD NO. 12 UNION BANK ATM LANE, MLA COLONY BANJARA HILLS, HYDERABAD - 34

# హోండా ఈ-క్లచ్ టెక్నాలజీ బైక్స్ ధరలు ఎలా ఉన్నాయంటే?



హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా.. తన సీబీ650ఆర్, సీబీఆర్650ఆర్ బైకులను ఈక్లచ్ వేరియంట్స్ రూపంలో లాంచ్ చేసింది. వీటి ధరలు వరుసగా రూ. 9.60 లక్షలు, రూ. 10.40 లక్షలు (ధరలు ఎక్స్‌షోరూమ్). వీటి ధరలు స్టాండర్డ్ మోడల్స్ ధరల కంటే రూ. 40000 ఎక్కువ. హోండా సీబీ650ఆర్, సీబీఆర్650ఆర్ బైకులు చూడటానికి స్టాండర్డ్ మోడల్స్ మాదిరిగా ఉన్నప్పటికీ.. ఇందులోని ఈ క్లచ్ టెక్నాలజీ క్లచ్ లివర్‌ను మాడ్యులేట్ చేయాల్సిన అవసరం లేకుండా గేర్‌లను మార్చడానికి అనుమతిస్తుంది. ఇందులో క్లచ్ లివర్ అలాగే ఉంటుంది. అయితే రైడర్ కావలసినప్పుడు మాన్యువల్ కంట్రోల్ తీసుకోవచ్చు. సీబీ650ఆర్, సీబీఆర్650ఆర్ ఈ వేరియంట్స్ రెండూ కూడా 649cc ఇన్‌లైన్ ఫోర్‌సిలిండర్ ఇంజిన్ ద్వారా 95 హార్స్ పవర్, 63 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తాయి. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ పొందుతుంది. కాబట్టి పర్ఫామెన్స్ కూడా మునుపటి మోడల్స్ మాదిరిగానే ఉంటుంది.

# టైటాన్ కొత్త ఆటోమేటిక్ వాచీలు




**ముంబై:** వాచీల తయారీ సంస్థ టైటాన్ సరికొత్త ఆటోమేటిక్స్ కలెక్షన్ శ్రేణిని ప్రవేశపెట్టింది. ఫీనిక్స్, నెక్సస్, గోల్డెన్ హార్ట్ తదితర వాచీల్లో ఆకర్షణీయమైన స్కెలిటల్ డయల్స్ ఉంటాయని సంస్థ తెలిపింది. అలాగే, డ్యుయల్ ఫినిష్ సాలిడ్ లింక్ స్ట్రాప్‌లు, 21 జ్యుయల్ బేరింగ్‌లు మొదలైన ప్రత్యేకతలతో వీటిని రూపొందించినట్లు టైటాన్ వాచెస్ మార్కెటింగ్ హెడ్ అపర్ణ రవి తెలిపారు. వీటి ధర శ్రేణి రూ. 18,325 నుంచి రూ. 22,150 వరకు ఉంటుంది.

# అంబానీ మామిడి తోట: ఏటా ఎన్ని కోట్ల ఆదాయమో తెలుసా?



భారతదేశంలో దాదాపు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న భారతీయ కుబేరుడు 'ముకేశ్ అంబానీ' గురించి అందరికి తెలుసు. కానీ ఈయన ప్రపంచంలోనే అతిపెద్ద మామిడి ఎగుమతిదారు కూడా అని కొంత మందికి మాత్రమే తెలిసి ఉంటుంది. ముకేశ్ అంబానీకి గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో సుమారు 600 ఎకరాల మామిడి తోట ఉంది. ఇక్కడ 200 కంటే ఎక్కువ మామిడి పండ్ల రకాలు ఉన్నట్లు సమాచారం. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మామిడితోట కావడం గమనార్హం. ఇందులో కేసర్, అల్ఫోన్సో, రత్న, సింధు, నీలం, ఆమ్రపాలి వంటి దేశీయ మామిడి జాతులు.. ఫ్లోరిడాకు చెందిన టామీ అట్కిన్స్, కెంట్ & ఇజ్రాయెల్ దేశానికి చెందిన లిల్లీ, కీట్, మాయా వంటి అంతర్జాతీయ రకాలు ఉన్నట్లు సమాచారం. ముకేశ్ అంబానీ మామిడి తోటలో ప్రతి ఏటా 600 టన్నుల కంటే ఎక్కువ అధిక నాణ్యత కలిగిన మామిడి పళ్ళు ఉత్పత్తి అవుతాయి. వీటిని రిలయన్స్ సంస్థ భారతదేశంలో మాత్రమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలో కూడా విక్రయిస్తూ.. ఆసియాలోనే అతిపెద్ద మామిడి ఎగుమతిదారుగా రికార్డ్ సృష్టించింది.

**మామిడి తోట పెట్టడానికి కారణం**

1997లో గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న చమురు శుద్ధి కర్మాగారం వల్ల కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని.. కాలుష్య నియంత్రణ మండలి తగిన చర్యలు తీసుకోవలసి వచ్చింది. అలాంటి సమయంలో అక్కడ మామిడి తోటను ఏర్పాటు చేయడం జరిగింది. అదే నేడు ప్రపంచంలోనే అతిపెద్ద మామిడి తోటగా గుర్తింపు తెచ్చింది. ఈ మామిడి తోట ద్వారా ఏడాదికి రూ.200 కోట్ల వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం.

# రూ.51 వేలతో బుకింగ్


## లాంచ్‌కు సిద్ధమవుతున్న కొత్త కారు



జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా త్వరలోనే దేశీయ మార్కెట్లో సరికొత్త ఎంపీవీ 'ఎం9' లాంచ్ చేయనుంది. అంతకంటే ముందు సంస్థ ఈ కారు కోసం రూ. 51000 టోకెన్ మొత్తంతో బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. లాంచ్‌కు సిద్దమవుతున్న ఎంజీ ఎం9 ఎలక్ట్రిక్ కారు.. పరిమాణం పరంగా కియా కార్నివాల్ & టయోటా వెల్‌ఫైర్ వంటి వాటికంటే పెద్దదిగా ఉంటుంది. మంచి డిజైన్, లేటెస్ట్ ఫీచర్స్ పొందనున్న ఈ ఎంపీవీ మార్చి ప్రారంభంలోనే లాంచ్ కావాల్సి ఉంది. కానీ లాంచ్ వాయిదా పడింది. ఎప్పుడు లాంచ్ అవుతుందనే విషయం కంపెనీ ప్రస్తుతానికి వెల్లడించలేదు. దీని ధర రూ. 65 లక్షల కంటే ఎక్కువ ఉంటుందని సమాచారం. రెండు సన్‌రూఫ్‌లు, 64 కలర్ యాంబియంట్ లైటింగ్, హీటింగ్, వెంటిలేషన్, మసాజ్ ఫంక్షన్‌లతో పవర్డ్ ఫ్రంట్ అండ్ రియర్ సీట్లు, ఫోల్డ్ అవుట్ ఒట్టోమన్ సీట్లు, పవర్డ్ రియర్ స్లైడింగ్ డోర్లు, రియర్ ఎంటర్టైన్‌మెంట్ స్క్రీన్‌లు వంటి వాటితో పాటు.. లెవల్ 2 ADAS కూడా ఈ కారులో ఉండనుంది. బ్యాటరీ, రేంజ్ వంటి వివరాలు అధికారికంగా వెల్లడి కాలేదు.

# అప్పు తీర్చడం ఎలా?

## చాట్‌జీపీటీ సమాధానం




చాలీచాలని జీతాలతో పనిచేసేవారి సంఖ్య ఎక్కువే ఉంది. జీతాలు సరిపోక పోవడంతో లోన్స్ తీసుకోవడం లేదా ఇతరుల దగ్గర అప్పు చేయడం వంటివి చేస్తారు. అప్పులు ఎక్కువైపోయినప్పుడు వాటిని ఎలా తీర్చాలో తెలియక కొందరు సతమతమవుతారు. చేసిన అప్పును సులభంగా ఎలా తీర్చాలి?, అనే ప్రశ్నకు.. చాట్‌జీపీటీ ఇచ్చిన సమాధానం ఇక్కడ చూసేద్దాం.

**స్నోబాల్ విధానం:**
మీరు చేసిన మొత్తం అప్పుల్లో చిన్న అప్పులను ముందుగా తీర్చేయాలి. ఇలా చేయడం వల్ల అప్పుల సంఖ్య తగ్గుతుంది. ఇది మీకు కొంతవరకు మానసిక ప్రశాంతతను అందిస్తుంది.

**అవలాంచీ విధానం:**
అత్యధిక వడ్డీ చెల్లిస్తున్న అప్పులను ముందుగా తీర్చేయాలి. వడ్డీ ఎక్కువ కడుతున్న అప్పులు తీర్చేయడం వల్ల.. ఆర్థిక భారం కొంత తగ్గుతుంది. ఎక్కువ వడ్డీ చెల్లించే అవసరం కూడా ఉండదు.


**బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్:**
చిన్న మొత్తంలో అప్పు ఉంటే.. దానిని క్రెడిట్ కార్డుకు బదిలీ చేయడం ఉత్తమం. ఇలా క్రెడిట్ కార్డు ద్వారా అప్పు చెల్లించడం ద్వారా ఆర్థిక ఒత్తిడి తగ్గుతుంది. వడ్డీ రేటు కూడా కొంత తగ్గుతుంది.

**ఆదాయాన్ని పెంచి, ఖర్చులను తగ్గించండి:**
అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవాలి. ఆదాయాన్ని పెంచుకోవడానికి పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేయడం వంటివి చేయాలి. పొదుపు చేయడం పెంచాలి. మీ డబ్బు ఎక్కడ.. ఎక్కువ ఖర్చు అవుతుందో అర్థం చేసుకోవడానికి మీ ఆదాయం, ఖర్చులను బేరీజు వేసుకోండి. ఇలా చేసినప్పుడు ఖర్చులు తగ్గించడం సాధ్యమవుతుంది.

**అప్పుల ఏకీకరణ:**
బ్యాంకులలో ఒకటి కంటే ఎక్కువ లోన్స్ తీసుకుని ఉన్నట్లయితే.. వాటన్నింటినీ ఒకటే లోన్ కిందికి వచ్చేలా మార్చుకోవాలి. ఇలా చేయడం వల్ల వడ్డీ తగ్గుతుంది. ఈఎంఐ విధానం ద్వారా అప్పు చెల్లిస్తారు కాబట్టి.. అప్పు చెల్లించడం సులభతరం అవుతుంది.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## పుల్వామా దాడి చేసింది మేమే: పాకిస్తాన్



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ మరోసారి తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. 2019 ఫిబ్రవరి 14న కశ్మీర్‌లోని పుల్వామాలో 40మంది భారత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై దాడి వెనుక తమ హస్తం ఉందని అంగీకరించింది. ఇన్ని రోజులు పుల్వామా దాడిలో తమకు ప్రమేయం లేదన్న పాక్.. ఇప్పుడు బహిరంగంగా అంగీకరించడంపై అంతర్జాతీయ సమాజం నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిపై పాకిస్తాన్‌కు భారత్ తగిన గుణం పాఠం చెబుతోంది. ఆపరేషన్ సిందూర్ (Operation Sindoor)తో ఇండియన్ ఆర్మీ.. పాక్,పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో క్షిపణి దాడులు చేసింది. లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్ ఉగ్ర స్థావరాల్ని, ఉగ్రవాదుల్ని మట్టిలో కలిపేసింది. దీంతో భారత్ చేతిలో చావు దెబ్బ తిన్న పాకిస్తాన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. భారత్ కొనసాగిస్తున్న ఆపరేషన్ సిందూర్‌పై బహిరంగంగా స్పందించింది ఇటీవల ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీ ఐఎస్పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి,పాక్ ఎయిర్‌ఫోర్స్ ఎయిర్ వైస్ మార్షల్,పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్ డైరెక్టర్ పబ్లిక్ రిలేషన్స్ ఔరంగజేబ్ అహ్మద్ ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పుల్వామా దాడితో మా ఎత్తుగడ ఎలాంటిదో చూపించాం. మా దేశ గగనతలం, భూమి, జలాలు, ప్రజలకు ముప్పు పొంచి ఉంటే ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోం. దేశ ప్రజల రుణం తీర్చుకుంటాం. ఇప్పటికే పుల్వామాలో మా వ్యూహాత్మక చతురత ప్రదర్శించాం' అని ఔరంగజేబ్ అహ్మద్ అన్నారు. ఔరంగజేబ్ అహ్మద్ ప్రకటనతో ఇన్ని రోజులు పుల్వామా దాడి వెనుక తమ పాత్రలేదని బుకాయించిన పాకిస్తాన్ ఇప్పుడు బహిరంగంగా ఉగ్రవాదంతో నెరపుతున్న సంబంధాల గురించి ప్రకటన చేయడంపై విమర్శలకు దారి తీసింది.



## పాక్‌పై బలూచ్ లిబరేషన్ ఆర్మీ

# కీలక ప్రకటన

మాంగోచార్ తమకు స్వతంత్ర దేశం కావాలని ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తున్న బలూచ్ తిరుగుబాటుదారులు.. మరోసారి కీలక ప్రకటన చేశారు. పాకిస్తాన్‌ను ఉగ్రదేశంగా గుర్తించాలంటూ డిమాండ్ చేశారు. అదే సమయంలో పాక్ ఉగ్రస్థావరాలపై దాడులకు దిగిన భారత్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తామంటూ ప్రకటించారు. పాకిస్తాన్‌పై భారత్ సైనిక చర్య తీసుకుంటే, పశ్చిమ సరిహద్దుల నుంచి పాక్‌పై తిరుగుబాటు చేస్తామన్నారు. భారత్‌కు సైనిక శక్తిగా నిలుస్తామంటూ ప్రకటించారు. పాకిస్తాన్‌లో 40 శాతం భూభాగం తమదేనని, తమకు ప్రత్యేక దేశం కావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పాకిస్తాన్ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలుపెట్టారు. అవకాశం దొరికినప్పుడల్లా పాకిస్తాన్‌కు నిద్ర పట్టకుండా చేస్తూ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉగ్రవాదులు ఏరివేతే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టగా, అందుకు బలూచ్ తిరుగుబాటుదారులు సైతం మద్దతు తెలుపుతున్నారు. పాకిస్తాన్‌ను ఉగ్రదేశంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.



# ఘోరం లోయలో పడిన బస్సు

## 21 మంది ప్రయాణికులు దుర్మరణం

**కొలంబో:** శ్రీలంకలో పెను విషాదం చోటు చేసుకుంది. కోట్మాలేలోని కరండీ ఎల్లా ప్రాంతం నుంచి 78 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు లోయలో పడింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో 21 మంది ప్రయాణికులు మరణించగా.. 30 మందికి పైగా తీవ్రంగా గాయ పడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు,రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాయపడ్డ క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మరోవైపు,పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించ వల్లే ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రమాదం జరిగే సమయంలో బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు ఉండడం, కోట్మాలే ప్రాంతంలో బస్సు అదుపు తప్పి లోయలో పడినట్లు సమాచారం. దుర్ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు ప్రమాదానికి గల కారణాల్ని అన్వేషిస్తున్నారు.

# ప్రధాని మోదీకి జేడీ వాన్స్ ఫోన్

**న్యూఢిల్లీ:** అగ్రరాజ్యం అమెరికా సాక్షిగా భారత్‌పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ చర్చలకు ముందు భారత ప్రధాని నరేంద్ర మోదీకి యూఎస్‌ఏ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫోన్ చేసి మాట్లాడారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలపై మోదీతో మాట్లాడారు జేడీ వాన్స్. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు జేడీ వాన్స్. అయితే పాక్ దాడి చేస్తే తాము దాడికి దిగుతామంటూ జేడీ వాన్స్‌కు మోదీ స్పష్టం చేశారు. తమ సంయమనం బలహీనత కాదని, దేశ భద్రతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని మోదీ పేర్కొన్నారు ఉగ్రవాదంపై రాజీపడే ప్రసక్తే లేదని జేడీ వాన్స్‌కు తేల్చిచెప్పారు నరేంద్ర మోదీ. రేపు (సోమవారం) పాకిస్తాన్ తో కాల్పుల విరమణ అంశానికి సంబంధించి చర్చలు జరుగుతున్న సమయంలో జేడీ వాన్స్ ఫోన్ చేసి మాట్లాడటం చర్చనీయాంశమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ నేతృత్వంలో భారత్‌పాక్‌ల మధ్య కాల్పుల విరమణ అంశంపై చర్చలు జరుగనున్న తరుణంలో జేడీ వాన్స్ ముందగా ఫోన్ చేసి మోదీతో మాట్లాడారు. అయితే అంతకముందు కశ్మీర్ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మోదీ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. పీవోకే విషయంలో భారత్ రాజీపడే ప్రసక్తే ఉండదన్నారు. దీనికి ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని అమెరికాకు పరోక్షంగా చెప్పేశారు మోదీ. పీవోకే తమదేనని, ఇందులో ఎవరు జోక్యం అవసరం లేదన్నారు. పీవోకేను తమకు అప్పగించడం ఒక్కటే పాకిస్తాన్‌కు ఉన్న ఆప్షన్ అని మోదీ తెగేసి చెప్పేశారు. కాగా, భారత్, పాకిస్తాన్‌ల మధ్య చోటు చేసుకున్న ఉద్రిక్తతలు. ఆపై చోటు చేసుకున్న కాల్పుల విరమణ అంగీకారంతో పరిస్థితులు సద్దుమణిగాయి. పాకిస్తాన్ కాళ్ల బేరానికి డైరెక్ట్‌గా భారత్‌ను ఆశ్రయించకపోయినా అమెరికా అడ్డం పెట్టుకుని కాల్పుల విరమణకు వచ్చారన్నది జగమెరిగిన సత్యం. భారత్, పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకారం అంటూ ముందుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడమే ఇందుకు ఉదాహరణ. ఇక్కడ యుద్ధానికి కాలుదువ్వింది పాకిస్తాన్.. అసలు కాల్పులకు పాల్పడుతోంది ఎవరు?. అది పాకిస్తాన్ కాదా?. అందుకు పహల్గామ్ ఘటన సాక్ష్యం కాదా?. మరి కాల్పుల విరమణ అనేది ఇక్కడ కేవలం పాకిస్థాన్‌కే వర్తిస్తుందనేది ప్రపంచానికి అంతటికీ అర్థమైంది. అయితే దాయాది పాకిస్తాన్‌ను అంత త్వరగా నమ్మలేమన్నది కూడా తేలిపోయింది. అయితే ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్‌ను భారత్ కొనసాగించనుంది. ఈ విషయాన్ని భారత ఆర్మీ స్పష్టం చేసింది కూడా. పాక్ ఏమైనా దుశ్చర్యలకు పాల్పడితే ఆపరేషన్ సిందూర్ సిద్ధంగానే ఉందనే సంకేతాలు పంపింది భారత ప్రభుత్వం.





# నాన్న మరణించిన రోజు..
## నవ్వుతూ ఫోటోలు దిగా: సమంత

టాలీవుడ్ హీరోయిన్ సమంత ఇప్పుడు హీరోయిన్ మాత్రమే కాదు.. నిర్మాత కూడా. శుభం మూవీతో నిర్మాతగా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం ఆమె నిర్మించిన శుభం సినిమా థియేటర్లలో సందడి చేస్తోంది. ఇప్పుడు నిర్మాతగా మారిపోయిన సామ్.. ఇటీవల పలు ఇంటర్వ్యూలకు హాజరైంది. ఈ నేపథ్యంలో ఓ బాధాకర సంఘటనను వెల్లడించింది. తన తండ్రి అంత్యక్రియలకు వెళ్తుంటే కొంతమంది సెల్ఫీలు అడిగారని గుర్తు చేసుకుంది. సమంతా తాజా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'అభిమానులు తన దగ్గరికి ఫోటోలు తీయడానికి వచ్చినప్పుడు తాను ఎప్పుడూ నో చెప్పలేదు. చెన్నైలో తన తండ్రి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్తున్న సమయంలోనే కొంతమంది అభిమానులు ఫోటో తీయడానికి తన దగ్గరికి వచ్చారు. అయినా నేను వారికి నో చెప్పలేదు. ఎందుకంటే తన విజయానికి కారణం తన అభిమానులే. మనం సెలబ్రిటీలు ఎలాంటి బాధలు అనుభవిస్తున్నామో వారికి తెలియకపోవచ్చు. అందుకే నేనెప్పుడూ అభిమానుల ఫోటోలకు నో చెప్పను' అని ఆ సంఘటనను గుర్తు చేసుకుంది ఆ రోజును గుర్తుచేసుకుంటూ.. 'డిసెంబర్‌లో నాన్న మరణించారని నా తల్లి నుంచి ఉదయం నాకు ఫోన్ వచ్చింది. నేను వెంటనే ముంబయి నుంచి చెన్నైకి విమానంలో ప్రయాణించాల్సి వచ్చింది. కొంతకాలంగా నాన్నతో మాట్లాడకపోవడంతో నేను షాక్‌కు గురయ్యాను. నాలో ఎలాంటి స్పందన లేకుండా విమానంలో కూర్చుండిపోయా. ఆ సమయంలో కొందరు నా ఫోటో కోసం అడిగిన విషయం నాకు గుర్తుంది. నేను నిలబడి వారితో ఫోటోలకు నవ్వుతూ ఉన్నా" అని తెలిపింది. మనం ఏ స్థితిలో ఉన్నారో వారికి తెలియదు.. తెలియనివారితో ఫోటో అడగడానికి చాలా ధైర్యం అవసరం.. అందుకే నో చెప్పి వారిని బాధపెట్టాలని అనుకోలేదని సమంత వెల్లడించింది. ఆ సంఘటన తనను ఒక సెలబ్రిటీగా ఉండటంలో ఎదురయ్యే ఇబ్బందుల గురించి ఆలోచించేలా చేసిందని సమంత పేర్కొంది. వారితో సెల్ఫీల కోసం నేను నవ్వుతున్నప్పుడు అది నా మనసును తాకిందని.. ఎందుకంటే తండ్రి మరణించిన రోజున ఏ వ్యక్తి నవ్వాలని అనుకోడని వివరించింది. ఇది పూర్తిగా వేరే ప్రపంచమని సమంత తెలిపింది. ఇక సినిమాల విషయానికొస్తే సమంత 'బంగారం' అనే మూవీలో కనిపించనుంది.

## డైరెక్షన్... యాక్షన్... కల్ట్ స్టార్ట్




మాస్ యాక్టర్‌గా విశ్వక్ సేన్‌కి మంచి ఫాలోయింగ్ ఉన్న సంగతి తెలిసిందే. దర్శకునిగా తొలి చిత్రం 'ఫలక్‌నుమా దాస్'తోనే తన ప్రతిభను నిరూపించుకున్నారు విశ్వక్. ఆ తర్వాత 'దాస్ కీ దమ్కీ' చిత్రంలో నటించి, దర్శకత్వం వహించారు. ఇప్పుడు విశ్వక్ సేన్ హీరోగా ఆయన డైరెక్షన్‌లోనే '#కల్ట్' చిత్రం ఆరంభమైంది. ఈ చిత్రానికి కథ కూడా రాసుకున్నారు విశ్వక్. 40 మంది నూతన నటీనటులను పరిచయం చేస్తూ, కరాటే రాజు, సందీప్ కాకర్ల నిర్మిస్తున్న ఈ చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చిన్నబాబు) టైటిల్ లోగోను లాంచ్ చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముహూర్తపు షాట్‌కు కెమెరా స్విచ్చాన్ చేయగా, అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. ఆదివారమే రెగ్యులర్ షూటింగ్ ఆరంభించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా న్యూ ఏజ్ పార్టీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. తెలుగు, హిందీ, జపనీస్, స్పానిష్, ఇంగ్లిష్ భాషల్లో సినిమాని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. నటుడు-దర్శకుడు తరుణ్ భాస్కర్ డైలాగ్స్ అందించిన ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: అరవింద్ విశ్వనాథన్.

# కోలీవుడ్ ఎంట్రీ




రాజ్ తరుణ్ కోలీవుడ్ ఎంట్రీ ఖరారైంది. రాజ్ తరుణ్ హీరోగా ప్రముఖ సినిమాటోగ్రాఫర్–దర్శకుడు విజయ్ మిల్టన్ దర్శకత్వంలో ఓ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం తెరకెక్కనుంది. రఫ్‌నోట్ ప్రోడక్షన్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. మే 11 (ఆదివారం) రాజ్ తరుణ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం ఏకకాలంలో చిత్రీకరణ జరుపుకోనుంది. రాజ్ తరుణ్‌కు ఇదే తొలి తమిళ చిత్రం కావడం విశేషం. "గోలీసోడా' ఫ్రాంచైజీలో భాగంగా విజయ్ మిల్టన్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ సినిమా కోసం రాజ్ తరుణ్ మేకోవర్ అయిన తీరు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. విభిన్నమైన కథ, బలమైన స్క్రీన్‌ప్లేతో ఈ యాక్షన్ ప్యాక్డ్ మూవీ ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది" అని చిత్రబృందం పేర్కొంది.

# కథే నా బలం: నవీన్ చంద్ర



''నవీన్ నాకంటే సీనియర్ నటుడు. అదృష్టాన్ని కాకుండా కష్టాన్ని మాత్రమే నమ్ముకున్న నవీన్ తన ప్రతి సినిమాలో బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. 'లెవన్' సినిమా ట్రైలర్‌లో మంచి క్రాఫ్ట్ కనిపించింది. కథని, కంటెంట్‌ని నమ్ముకుని చేసిన సినిమా ఇది. ఈ సినిమాతో నవీన్‌కి ఒక మంచి హిట్ రావాలని కోరుకుంటున్నాను'' అని సందీప్ కిషన్ అన్నారు. నవీన్ చంద్ర హీరోగా నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'లెవన్'. ఈ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రాన్ని లోకేశ్ అజ్లస్ దర్శకత్వంలో అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. రుచిర ఎంటర్టైన్మెంట్స్ డిస్ట్రిబ్యూటర్ ఎన్. సుధాకర్ రెడ్డి ఈ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా నటుడు-నిర్మాత సందీప్ కిషన్, అతిథులుగా దర్శకులు కరుణకుమార్, విశ్వనాథ్, అనిల్ విశ్వనాథ్, సాయిరాజేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ వేడుకలో నవీన్ చంద్ర మాట్లాడుతూ- ''ఇప్పటివరకు ఈ సినిమా చూసిన వారు బాగుందని చెప్పారు. వాళ్ల రియాక్షన్స్ చూసినప్పుడు నా ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. నా కథే నా బలం. నేను చేసే కథలు, పాత్రలు బాగుంటాయని ప్రేక్షకులు మొదట్నుంచి ప్రశంసిస్తున్నారు. ఈ గౌరవానికి రిటర్న్‌గా ఈ సినిమా ఉంటుందని నమ్ముతున్నాను. ఈ సినిమాలో ఉన్న యునిక్ కాన్సెప్ట్‌ని ఇప్పటివరకు ఏ థ్రిల్లర్‌మూవీలోనూ చూసి ఉండరు. ఈ సినిమా టైటిల్‌లోనే చాలా క్లూస్ ఉన్నాయి. ఎవరైనా ఆ క్లూస్‌ని డీకోడ్ చేస్తే వాళ్ళకి చాలా మంచి గిఫ్ట్ ఇస్తాను'' అని తెలిపారు. ''ఓ సినిమాకి సరైన నటీనటులు కుదిరితే, ఆ సినిమా సగం గెలిచినట్లే. అలా 'లెవన్' సినిమా సగం గెలిచింది. ఈ సినిమాను థియేటర్స్‌లో చూడండి'' అని తెలిపారు లోకేశ్.

# క్రీడా వార్తలు
# SPORTS NEWS



# ఈ నెల 16న ఐపీఎల్ పునఃప్రారంభం?
## రేపు టోర్నీపై రానున్న క్లారిటీ
### భారత్, పాక్ చర్చల తర్వాత అనుమతులు
### లీగ్ మ్యాచ్‌లను డబుల్ హెడర్ల పద్ధతిలో పూర్తి చేయాలని డిసైడ్

**మహా: స్పోర్ట్స్:** భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతలు కాల్పుల విరమణ ఒప్పందంతో తాత్కాలికంగా సద్దుమణగడంతో, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్‌ను తిరిగి పట్టాలెక్కించేందుకు బీసీసీఐ చురుగ్గా పావులు కదుపుతోంది. ఈ మేరకు ఫ్రాంచైజీలకు కీలక ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు లభిస్తే, మే 15 లేదా 16వ తేదీన ఐపీఎల్ సీజన్ తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాలతో ఐపీఎల్ అభిమానుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

**పంజాబ్ కింగ్స్ మినహా..**

జాతీయ మీడియా కథనాల ప్రకారం... పంజాబ్ కింగ్స్ జట్టు మినహా మిగిలిన అన్ని ఐపీఎల్ జట్ల ఆటగాళ్లు మే 13వ తేదీలోగా తమ తమ సొంత వేదికల్లో (హోం గ్రౌండ్స్‌లో) రిపోర్ట్ చేయాలని బీసీసీఐ ఫ్రాంచైజీలకు మౌఖికంగా సూచించింది. ఐపీఎల్ 2025 సీజన్‌ను పునఃప్రారంభించేందుకు వీలుగా త్వరలోనే నూతన షెడ్యూల్‌ను రూపొందించనున్నట్లు బోర్డు ఫ్రాంచైజీలకు తెలియజేసింది. ఈ నేపథ్యంలో, తమ విదేశీ ఆటగాళ్ల ప్రయాణ ప్రణాళికలను వెంటనే సమర్పించాలని కూడా కోరింది. దీంతో ఫ్రాంచైజీలు తమ విదేశీ క్రికెటర్లను తిరిగి భారత్‌కు రప్పించేందుకు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. మే 13 నాటికి అన్ని జట్ల ఆటగాళ్లు అందుబాటులోకి వస్తే, ముందుగా నిర్దేశించుకున్న ప్రకారం మే 25వ తేదీనే ఐపీఎల్ 2025 సీజన్‌ను ముగించాలని బీసీసీఐ యోచిస్తోంది. ఇందుకోసం మిగిలి ఉన్న 12 లీగ్ మ్యాచ్‌లను డబుల్ హెడర్ల పద్ధతిలో వేగంగా పూర్తి చేయాలని ప్రణాళిక రచిస్తోంది. ఇక పంజాబ్ కింగ్స్ జట్టుకు సంబంధించి, ఆ జట్టు మ్యాచ్‌లను ఒక తటస్థ వేదికపై నిర్వహించే అవకాశం ఉంది. అయితే ఆ వేదికను ఖరారు చేయాల్సి ఉంది.

# ఆర్సీబీకి భారీ షాక్.. ఐపీఎల్ నుంచి స్టార్ ప్లేయర్ ఔట్?



ఐపీఎల్ 2025 పునఃప్రారంభానికి బీసీసీఐ ప్రణాళికలు మొదలు పెట్టింది. భారత్‌పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తలు కాస్త తగ్గుముఖం పట్టడంతో ఐపీఎల్‌ను తిరిగి ప్రారంభించేందుకు భారత క్రికెట్ బోర్డు సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే మే 15 లేదా మే 16న ఐపీఎల్ మ్యాచ్‌లు మళ్లీ మొదలయ్యే అవకాశముంది. అయితే ఈ క్యాష్ రిచ్ లీగ్ పునఃప్రారంభమవుతున్న వేళ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు భారీ షాక్ తగిలే సూచనలు కన్పిస్తున్నాయి. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్, ఆస్ట్రేలియా స్టార్ పేసర్ జోష్ హాజిల్ వుడ్ గాయం కారణంగా ఐపీఎల్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరం కానున్నట్లు తెలుస్తోంది. హాజిల్ వుడ్ ప్రస్తుతం భుజం నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే మే 3న సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌కు అతడు దూరమయ్యాడు. అయితే అతడు జట్టుతో పాటు ఉండడంతో తర్వాతి మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడని ఫ్యాన్స్ భావించారు. కానీ అంతలోనే బీసీసీఐ ఐపీఎల్‌ను వారం రోజుల పాటు తాత్కాలికంగా వాయిదా వేసింది. దీంతో హాజిల్‌వుడ్ తన స్వదేశానికి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో అతడు తిరిగి భారత్‌కు వచ్చే సూచనలు కన్పించడం లేదు. జూన్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ ఉన్నందున ముందు జాగ్రత్తగా అతడిని తిరిగి పంపకూడదని క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే జరిగితే ఆర్సీబీకి గట్టి ఎదురు దెబ్బే అనే చెప్పాలి. ఈ ఏడాది సీజన్‌లో హాజిల్‌వుడ్ 10 మ్యాచ్‌ల్లో 18 వికెట్లు పడగొట్టాడు. టోర్నీ నిలిచే సమయానికి అత్యధిక వికెట్లు తీసిన మూడవ బౌలర్‌గా ఉన్నాడు. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్, స్టార్ ప్లేయర్ ట్రావిస్ హెడ్ కూడా తిరిగి వచ్చేది అనుమానమే. కాగా ఈ ఏడాది సీజన్‌లో ఆర్సీబీ దుమ్మురేపుతోంది. 11 మ్యాచులలో 8 విజయాలు సాధించి.. 16 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచింది.

# ఆర్సీబీ కెప్టెన్‌గా జితేష్ శర్మ..?



భారత్‌పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తల కారణంగా ఐపీఎల్2025ను బీసీసీఐ వారం రోజుల పాటు తాత్కాలికంగా వాయిదా వేసిన సంగతి తెలిసిందే. అయితే పరిస్థితులు కాస్త చల్లారడంతో ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌ను తిరిగి ప్రారంభించాలని బీసీసీఐ భావిస్తోంది. మే 15 నుంచి ఐపీఎల్ రీ స్టార్ట్ కానున్నట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. మంగళవారం (మే 13) నాటికి ఆటగాళ్లందరినీ జట్టుతో చేరేలా చూసుకోవాలని ఫ్రాంఛైజీలకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. డబుల్ హెడర్ (ఒకే రోజు రెండు) మ్యాచ్‌లు నిర్వహించి, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే మే 25న ఈ ఏడాది సీజన్‌కు ముగింపు పలకాలని బీసీసీఐ యోచిస్తోంది.

**ఆర్సీబీ కెప్టెన్‌గా జితేష్ శర్మ..**

ఇక ఇది ఇలా ఉండగా.. రాయల్ ఛాలెంజర్స్బెంగళూరు కెప్టెన్ రజత్ పాటిదార్ గాయం కారణంగా కనీసం ఒక మ్యాచ్‌కైనా దూరమయ్యే అవకాశముంది. మే 3న చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు పాటిదార్ చేతి వేలికి గాయమైంది. దీంతో అతడికి రెండు వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో అతడు కనీసం రెండు మ్యాచ్‌లకైనా దూరమవుతాడని అంతా భావించారు. కానీ ఐపీఎల్2025లో మధ్యలోనే ఆగిపోవడంతో ఆర్సీబీకి కలిసొచ్చింది. అతడు చేతి వేలి గాయం నుంచి కోలుకుంటున్నాడు. ఒకవేళ ఐపీఎల్2025 మే 15 నుంచి తిరిగి ప్రారంభమైతే.. లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌కు పాటిదార్ కానున్నాడు. పాటిదార్ గైర్హాజరీలో వికెట్ కీపర్ బ్యాటర్ జితేష్ శర్మ ఆర్సీబీ జట్టును నడిపించనున్నాడు. ఇప్పటికే ఈ విషయాన్ని జితేష్ శర్మ ధ్రువీకరించాడు. "లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌కు పాటిదార్ దూరమయ్యాడు. అతడి స్థానంలో కెప్టెన్‌గా నాకు అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలపాలనుకుంటున్నాను. ఇది నాకు, నా కుటుంబానికి చాలా గొప్ప విషయం. దేవదత్ పడిక్కల్, రజిత్ పాటిదార్ ఇద్దరూ అందుబాటులో లేనందున, వారిస్థానాలను ఎవరితో భర్తీ చేయాలని నేను ఆలోచిస్తున్నాను. నాకు నిజంగా ఇది చాలా పెద్ద బాధ్యత" అని ఐపీఎల్ సస్పెన్షన్‌కు ముందు జితేష్ శర్మ ఆర్సీబీ బోల్డ్ డైరీస్‌లో పేర్కొన్నాడు. ఒకవేళ మే 15న ఐపీఎల్ తిరిగి ప్రారంభం కాకపోతే కెప్టెన్సీ అవకాశాన్ని జితేష్ కోల్పోయే ఛాన్స్ ఉంది.

# ఐపీఎల్-2025 ఫైనల్ వేదిక, తేదీ మార్పు?



ఐపీఎల్2025 సీజన్‌ను తిరిగి ప్రారంభించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు లభిస్తే మే 15 లేదా 16వ తేదీన ఐపీఎల్ తిరిగి మొదలయ్యే అవకాశముంది. మంగళవారం (మే 13) నాటికి ఆటగాళ్లందరినీ జట్టుతో చేరేలా చూసుకోవాలని ఫ్రాంచైజీలకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ ఫైనల్ వేదికను మార్చాలని భారత క్రికెట్ బోర్డు యోచిస్తున్నట్లు సమాచారం. షెడ్యూల్ ప్రకారం.. మే 25న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉంది. ఇప్పుడు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియానికి ఫైనల్ వేదికను మార్చనున్నట్లు పలు రిపోర్టులు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా ఫైనల్ మ్యాచ్ తేదీలో కూడా మార్పు చోటు చేసుకోనున్నట్లు ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. మే 25 బదులుగా మే 30న తుది పోరు జరగనున్నట్లు తెలుస్తోంది. కాగా భారత్‌పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తల కారణంగా ఐపీఎల్2025ను బీసీసీఐ వారం రోజుల పాటు తాత్కాలికంగా వాయిదా వేసిన సంగతి తెలిసిందే. అయితే మిగిలిన మ్యాచ్‌లకు విదేశీ ఆటగాళ్ల అందుబాటుపై సందిగ్ధత కొనసాగుతోంది. చాలా మంది ఫారన్ ప్లేయర్లు ఇప్పటికే తమ స్వదేశాలకు వెళ్లిపోయారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com